- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం 30-05-2026 సంపుటి : 01 సంచిక : 68 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 68 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha



## ఐపీఎల్ ఫైనల్లోకి గుజరాత్

- కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సెంచరీ
- సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ
- సూర్యవంశీ 96 పరుగుల పోరాటం వృధా

క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపు



హైదరాబాద్ మే 29 ( మహాప్రభ)
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (104) బాధ్యతాయుతంగా ఆడి అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ అర్ధసెంచరీతో రాణించాడు.

-మిగతా 3 లో



## పదవి పోయినా పెత్తనం నాదే..

- ఢిల్లీలో చక్రం తిప్పుతున్న సిద్ధూ
- సమన్వయ కమిటీ కోసం పట్టు
- తనయుడికి కీలక శాఖలు కేటాయించాలని డిమాండ్

బెంగళూరు, మే 29 ( మహాప్రభ)
కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తుండగా కొత్త ప్రభుత్వం ఏర్పడేంతవరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కొనసాగనున్నారు. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పదోన్నతికి మార్గం సుగమం చేసేందుకు తన పదవికి రాజీనామా చేసిన సిద్ధరామయ్య పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యహరించేందుకు ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ప్రతిపాదించినట్లు తెలిసింది. కొత్త మంత్రులతో కలసి డీకే వచ్చే వారం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయవచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి.

-మిగతా 3 లో



## సర్ తో అందరికీ సమస్యే

- లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు నష్టం
- సర్ తో ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంచుకోవాలి
- దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదం : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ మే 29 ( మహాప్రభ)
ప్రత్యేక విస్తృత సవరణ (సర్ )తో లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య అని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో నిర్వహించిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, పీసీసీ అడ్వైజరీ కమిటీ ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ పైన అందరు అవగహన పెంచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామమని అభినందించారు. సర్ లంబాడీ లు ,ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజలు పెద్ద ఎత్తున వలస పోయారనీ, అలాంటి వారితో పాటు మహిళలకు కూడా సర్ వల్ల సమస్యలు ఎదురుకావొచ్చని చెప్పారు. సర్ కారణంగా దళితులు,

-మిగతా 3 లో

# ప్రతి గింజా కొంటాం

## రైతులు ఆందోళన చెందొద్దు

- అబద్ధపు ప్రచారాన్ని నమ్మొద్దు
- తడిసిన ధాన్యం 9 వేల మెట్రిక్ టన్నులు కొన్నాం
- ధాన్యం సరఫరాకు ఇసుక, సిమెంట్ లారీలు, డీసీఎంలను సమకూర్చాం
- రెండు లక్షల మంది సిబ్బంది పని చేస్తున్నారు
- బీజేపీది రైతు ఘోష యాత్ర కాదు... ? అధికార ఘోష యాత్ర : మంత్రులు
- ఎన్ ఉత్తమ్, తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్ మే 29 ( మహాప్రభ)
ఇటీవల కురిసిన వర్షాలకు తడిన తడిసిన ధాన్యాన్ని 9వేల మెట్రిక్ టన్నులను కొన్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ధాన్యం సరఫరాకు ఇసుక, సిమెంట్ లారీలు, డీసీఎంలను సమకూర్చామని తెలిపారు. ధాన్యం సేకరణలో దాదాపు రెండు లక్ష?ల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. 2008 రైస్ మిల్లులలకు 13వేల వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. 20.86 కోట్ల గన్నీ బ్యాగులు

-మిగతా 3 లో






## కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు

- అమెరికా యుద్ధ విమానాన్ని కూల్చేశాం: ఇరాన్
- అలాంటిదేమీ లేదన్న యూఎస్

టెహ్రాన్ మే 29 ( మహాప్రభ)
అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. రెండు దేశాలూ పరస్పర దాడులకు దిగడంతో పశ్చిమాసియాలో మళ్లీ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ అధికారిక మీడియా ఒక కీలక ప్రకటన చేసింది. అమెరికాకు చెందిన ఓ యుద్ధ విమానాన్ని కూల్చేశామని ప్రకటించింది.

-మిగతా 3 లో



## రైతు డిస్కం ప్రభుత్వ కుట్ర

- రైతుల భవిష్యత్తును ఆగం చేసే ప్రతిపాదన
- ఈఆర్సీ దీనిని రిజెక్ట్ చేయాలి
- రైతు డిస్కంపై పబ్లిక్ హియరింగ్‌లో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్‌మే 29 ( మహాప్రభ)
రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రైతులు అడగకుండానే విద్యుత్ సంస్కరణల పేరుతో చేపట్టిన ఈ చర్య రైతుల పాలిట

-మిగతా 3 లో

## ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత

- క్యూఆర్ పరిధిలో సంతృప్తినిచ్చే ఇళ్ల డిజైన్
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్‌మే 29 ( మహాప్రభ)
పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

-మిగతా 3 లో

# యూపీఎస్సీని చూసి బుద్ధి తెచ్చుకోండి


## కేంద్రంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

- నీట్ పేపర్ లీకేజీ అత్యంత బాధాకరం
- యువతను నిరాశపరచడం మంచిది కాదన్న ధర్మాసనం
- ప్రత్యేక అఫిడవిట్ దాఖలుకు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశం

న్యూఢిల్లీ,మే 29 ( మహాప్రభ)
నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసుపై సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటువంటివి జరగడం చాలా బాధాకరమని సుప్రీంకోర్టు పేర్కొన్నది. నిజమైన జవాబుదారీతనం ఏర్పడే వరకు అసలు సమస్య ఆగదని స్పష్టం చేసింది. మనం మన యువతను నిరాశపరచకూడదని తెలిపింది. నీట్ పరీక్షల నిర్వహణ, ముగింపు ప్రక్రియను ప్రతి ఏటా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ద్వారా సంస్థాగతం చేసే

-మిగతా 3 లో





## ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై దృష్టి పెట్టిన ఆర్బీఐ!

- ముద్రణ ఖర్చు తగ్గించే దిశగా కీలక కసరత్తు!
- పాలిమర్ నోట్లే పరిష్కారమని భావిస్తున్న ఆర్‌బీఐ!
- ఏటా వేల కోట్ల విలువైన కరెన్సీ రద్దు:
- ప్లాస్టిక్ నోట్లతో ఆ నష్టాన్ని నివారించే యోచనలో బ్యాంక్.
- త్వరలో పాలిమర్ కరెన్సీ పైలట్ ప్రాజెక్ట్
- ఏటీఎంలలోనూ ఈజీగా పంపిణీకి ఆర్‌బీఐ ప్రణాళిక!

న్యూఢిల్లీ మే 29 ( మహాప్రభ)
పాలిమర్ లేదా ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల ను ప్రవేశపెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిసింది. రోజు రోజుకూ కరెన్సీ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టేందుకు ఆర్బీఐ ప్లాన్ వేసింది. ఇటీవల పాట్నా, ముంబైలో జరిగిన ఆర్బీఐ బోర్డు సమావేశాల్లో పాలిమర్ నోట్ల గురించి చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పాలిమర్ లేదా ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టేందుకు విస్తృతంగా చర్చించారు. పాలిమర్ నోట్లకు ఎక్కువ సెల్ఫ్ లైఫ్ ఉంటుందని, తయారీ కోసం తక్కువ ఖర్చు అవుందని భావిస్తున్నారు. సంప్రదాయకర కాగితం కరెన్సీ తయారీకి ఎక్కువ ఖర్చు అవుతుంది. అంతేకాకుండా పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పేపర్ నోట్ల కన్నా.. పాలిమర్ నోట్ల తయారీకి తక్కువ ఖర్చు అవుతుంది. ఏటీఎంల ద్వారా కూడా

-మిగతా 3 లో



## కార్యకర్తల కృషితోనే మహానాడు ఘన విజయం

- ప్రతి పల్లె, ప్రతి ఇల్లు మహానాడు వేదికగా మారింది
- మై టీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు
- మహానాడు చరిత్రలో కొత్త రికార్డు సృష్టించింది
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల తీర్మానానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు
- ప్రతి ఒక్కరి కృషికి శిరస్సువంచి నమస్కరిస్తున్నా
- కార్య నిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్

అమరావతి మే 29 ( మహాప్రభ)
తెలుగుదేశం పార్టీ రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు 2026 విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్ శుక్రవారం స్పందించారు. మహానాడు 2026 విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కోట్లాది కుటుంబసభ్యుల ఆశీస్సులతో తాను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని వివరించారు.


-మిగతా 3 లో

# ఇండియాలో నాకు ఫాలోవర్లు ఎక్కువే



**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**
ఇండియాలో తనకు మద్దతు ఎక్కువగా ఉందని, ఫాలోవర్లు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నారని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ(్రావీ చీమ్ఘుఅఖ్షుట్రబ) తెలిపారు. ఇజ్రాయిల్, ఇండియా మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఆయన మాట్లాడారు. ప్రాంతీయ వ్యూహాత్మకం, కూటమి, టెక్నాలజీ వృద్ధిపై ఆయన ఓ మీటింగ్‌లో మాట్లాడుతూ.. భారత్ తమకు కీలకమైన భాగస్వామి అన్నారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాలు ఇజ్రాయిల్‌ను వేరుగా చూస్తున్నాయని ఆరోపించారు. కానీ భారత్‌లో మాత్రం తమకు మంచి గుర్తింపు ఉన్నట్లు నెతన్యహూ చెప్పారు. భారత్‌లో ఇజ్రాయిలీలకు అమితమైన ప్రేమ ఉందని, నిజంగా ఎక్కువగా అభిమానిస్తారని, ఇతర దేశాల కన్నా ఇండియాలో తనకు ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నట్లు నెతన్యహూ తెలిపారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ప్రాంతీయ శక్తులతో స్నేహ హస్తాన్ని చాచేందుకు ఇజ్రాయల్ ప్రయత్నిస్తున్నది. ఈ సందర్భంగా నెతన్యహూ వ్యాఖ్యలు కీలకంగా మారాయి. భారత్‌ను గొప్ప శక్తిగా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యూ పోల్చారు. పశ్చిమాసియా దేశాలతో ఉన్న పరిస్థితిని మరింత బలోపేతం చేయాలన్నారు. వివిధ దేశాలతో భాగస్వామ్యాన్ని పంచుకోవాలని భావిస్తున్నామని, భారత్ లాంటి గొప్ప శక్తివంతమైన దేశంతో మరింత విశిష్టమైన బంధాన్ని ఏర్పర్చుకోవాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఇజ్రాయిలీ సైనిక సామర్థ్యం, సాంకేతిక ఆవిష్కరణ, ఆర్థిక వృద్ధి పట్ల ప్రపంచ దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయని, దీనిలో భాగంగానే కొన్ని దేశాలు తమతో భాగస్వామ్యం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

# ఇరాన్‌లో మళ్లీ ఇంటర్నెట్ సేవలు ప్రారంభం..



**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**
ఇరాన్‌లో మళ్లీ ఇంటర్నెట్ సేవలు ప్రారంభం అయ్యాయి. అయితే స్వల్ప స్థాయిలో ఇంటర్నెట్ యాక్సెస్‌లోకి వచ్చింది. గత కొన్ని నెలల నుంచి ఇరాన్‌లో ఇంటర్నెట్ అందుబాటులో లేదు. బుధవారమే ప్రభుత్వం మళ్లీ సేవల్ని ప్రారంభించింది. కానీ నెట్ చాలా స్లోగా వస్తోంది. ఇంటర్నెట్‌పై ఆంక్షలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వాధి నేతలకు వ్యతిరేకంగా జనవరిలో ఇరాన్‌లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆ సమయంలో ఇంటర్నెట్‌పై ఆంక్షలు పెట్టారు. ఇక ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడి ప్రారంభించిన తర్వాత ఇరాన్‌లో ఇంటర్నెట్ పూర్తిగా బ్లాకౌట్ అయ్యింది. ఇంటర్నెట్ ట్రాకింగ్ కంపెనీ నెట్‌బ్లాక్స్ దీనిపై రిపోర్టును రిలీజ్ చేసింది. షట్‌డౌన్ కన్నా ముందు ఉన్ననాటి పరిస్థితులతో పోలిస్తే 86 శాతం ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు నెట్‌బ్లాక్స్ తెలిపింది. ఇక ఇంటర్నెట్ ట్రాఫిక్ సుమారు 40 శాతం ఉన్నట్లు కెంటిక్ కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు ఉన్నాయని, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి ప్లాట్‌ఫామ్‌లపై ఆంక్షలు కొనసాగుతున్నట్లు తెలిపారు. బ్లాక్ చేసిన సైట్లను వీక్షించేందుకు ఇరానీలు ఎక్కువగా వీపీఎన్‌పై ఆధారపడుతున్నట్లు తెలిసింది. ఇంటర్నెట్ నిషేధం వల్ల దేశంలో ఆన్‌లైన్ వ్యాపారం దెబ్బతిన్నది. నిరసనలు, యుద్ధం సమయంలో ఇరానీ కుటుంబాలు కమ్యూనికేట్ చేసుకునేందుకు ఇబ్బందిపడ్డాయి. అయితే అమెరికాతో శాంతి డీల్ కుదిరే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇంటర్నెట్‌ను పాక్షికంగా పునరుద్ధరించినట్లు తెలుస్తోంది.

# స్వచ్ఛందంగా వేశ్యగా మారడం నేరం కాదు : సుప్రీం




**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**
స్వచ్ఛందంగా వేశ్యగా మారడం నేరం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వారిని రెస్క్యూ ఆపరేషన్లు, ఇతర కేసుల పేరుతో వేధించడం, హింసించడం మానవ హక్కుల ఉల్లంఘన కింద పరిగణిస్తామని పోలీసులకు స్పష్టంచేసింది. ఎలాంటి రెస్క్యూ ఆపరేషన్లలో వేశ్యల పేర్లు, వివరాలు మీడియాకు చెప్పొద్దని హెచ్చరించింది. అలాగే మానవ అక్రమ రవాణాను, బలవంతపు శృంగార వృత్తిని పూర్తిగా అరికట్టాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలు, పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు మానవ అక్రమ రవాణా నిరోధానికి కీలక మార్గదర్శకాలు జారీచేసింది.

## దేశవ్యాప్తంగా ఒకే హెల్ప్‌లైన్ నెంబర్..

# 112ను అమలు చేయాల్సిందే..

### సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**
త్వరలో దేశవ్యాప్తంగా అందరికీ, అన్నింటికీ ఒకే హెల్ప్‌లైన్ నెంబర్ అమలులోకి రాబోతుంది. 112 నెంబర్‌ను దేశవ్యాప్తంగా, ఎమర్జెన్సీ నెంబర్‌గా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల్లోగా ఈ నెంబర్ అమలయ్యేలాగా తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాలకు సూచించింది. సేవ్ లైఫ్ ఫౌండేషన్ అనే రోడ్ సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని సుప్రీం బెంచ్ దీనిపై విచారణ జరిపి, ఆదేశాలిచ్చింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు ఎమర్జెన్సీ నెంబర్లు అమలులో ఉన్నాయి. పోలీసులకు 100, ఫైర్ సర్వీసెస్ కోసం




101, అంబులెన్స్‌ల కోసం 102, 108, హైవేలపై సహాయం కోసం 1033, మహిళల భద్రత కోసం 1091 నెంబర్లు దేశవ్యాప్తంగా అమలవుతున్నాయి. అయితే, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వీరిలో ఏ నెంబర్‌కు చేయాల అనే విషయంలో చాలా మంది గందరగోళానికి గురవుతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో అందాల్సిన సహాయం అందడం లేదు అందుకే అన్నింటికీ కలిపి ఒకే ఎమర్జెన్సీ సర్వీస్ నెంబర్ ఉంటే బాగుటుందని సేవ్ లైఫ్ సంస్థ కోరింది. ఈ నేపథ్యంలో అన్నింటినీ కలిపి ఒకే నెంబర్‌గా 112 అమలు చేయాలని కేంద్రం సూచించింది. కోర్టు వ్యాఖ్యల ప్రకారం.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరూ అత్యవసర వైద్య సేవలు పొందే హక్కు కలిగి ఉన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన పరిస్థితుల్లో ప్రతి నిమిషం కూడా ముఖ్యమేనని, బాధితుల పరిస్థితి క్షణాల్లోనే విషమించే అవకాశం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. అత్యవసర సేవలు ఆలస్యమైతే బాధితుల్ని కాపాడటం కష్టమవుతుందని కోర్టు అభిప్రాయపడింది. త్వరగా స్పందిస్తే బాధితుల్ని కాపాడవచ్చని తెలిపింది. అందువల్ల ప్రభుత్వాలు మూడు నెలల్లోగా 112 నెంబర్‌ను పూర్తిస్థాయిలో అమలులోకి తేవాలని ఆదేశించింది. దీనిపై ప్రతినెలా నివేదిక ఇవ్వాలని సూచించింది. రోడ్డు ప్రమాదాల్లో సేవలందించేందుకు జాతీయ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాలకు సూచించింది.

## ఈసారి వర్షాకాలంలో సాధారణం

# కంటే తక్కువ వర్షపాతం

**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**
భారతీయ వాతావరణ శాఖ వర్షాకలం వానల గురించి అప్‌డేట్ ఇచ్చింది. నైరుతీ రుతుపవనాల వల్ల దేశవ్యాప్తంగా ఈసారి సాధారణం కంటే తక్కువ స్థాయిలో వర్షపాతం నమోదు అవుతుందని ఐఎండీ హెచ్చరిక జారీ చేసింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు భారత్‌లో నైరుతీ రుతుపవనాల ప్రభావం వల్ల వర్షాలు కురిసే విషయం తెలిసిందే. వర్షం మీద ఆధారపడే అనేక వ్యవసాయ ప్రదేశాల్లో ఈసారి తక్కువ వర్షపాతం ఉంటుందని ఐఎండీ తన నివేదికలో చెప్పింది. ఇక జూన్ నెలలో అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, బీహార్, ఒడిశా, చత్తీస్‌ఘడ్, గుజరాత్, ఏపీతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో హీట్‌వేవ్ ఉంటుందని ఐఎండీ తెలిపింది. రాజస్థాన్, జార్ఖండ్ రాష్ట్రాల్లో మాత్రం సాధారణం కన్నా తక్కువ స్థాయిలో హీట్‌వేవ్ నమోదు అయ్యింది. అయితే వాతావరణ మార్పులను పరిశీలిస్తే, ఎల్ నినో లాంటి పరిస్థితులు ఉత్పన్నం అయ్యే రీతిలో ఉందని ఐఎండీ తెలిపింది. ఎల్ నినో వల్ల వర్షకాలం డిస్టర్బ్ అవుతుంది, దీని వల్ల




తక్కువ స్థాయిలో వర్షం పడుతుంది, కరువు పరిస్థితులు పెరిగే అవకాశం ఉన్నది. మే 16వ తేదీన నైరుతీ రుతుపవనాలు అండమాన్, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించాయి. అయితే మే 28వ తేదీ నాటికి అవి దక్షిణ అరేబియా సముద్రం, లక్షద్వీప్, బంగాళాఖాతం ప్రాంతాలకు అడ్వాన్స్ అయ్యాయి. అండమాన్ నికోబార్‌తో పాటు అండమాన్ సముద్రం మొత్తాన్ని కవర్ చేశాయి. అయితే ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితులు బలహీనంగా ఉన్నాయని, రాబోయే నెలల్లో బలపడే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ పేర్కొన్నది. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు చాలా వరకు దేశవ్యాప్తంగా సాధారణం కన్నా తక్కువ వర్షం ఉంటుందని, కానీ ఈశాన్య, నార్త్‌వెస్ట్ ప్రాంతాల్లో మాత్రం అధిక వర్షపాతం నమోదు అవుతుందని ఐఎండీ తెలిపింది. సెంట్రల్ ఇండియా, ఈస్ట్ ఇండియా ప్రాంతాల్లో స్వల్ప స్థాయిలో వర్షం నమోదు కానున్నది. నైరుతీ రుతుపవనాల వల్ల మాన్‌సూన్ కోర్ జోన్‌లో నార్మల్ కన్నా తక్కువ వర్షాలు నమోదు అవుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్న?యంజయ మహాపాత్ర తెలిపారు. వర్షాధారిత వ్యవస్థాయ ప్రాంతాలన్నీ మాన్‌సూన్ కోర్ జోన్‌లో ఉంటాయి. జూన్ నెలలో దేశవ్యాప్తంగా వర్షపాతం తక్కువ ఉంటుందని ఐఎండీ చెప్పింది. అనేక ప్రాంతాల్లో ఎక్కువ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు ఐఎండీ తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నార్మల్ కన్నా ఎక్కువగా నమోదు కానున్నాయి. తక్కువ వర్షపాతం వల్ల వ్యవసాయం, నీటి లభ్యత, హైడ్రోపవర్ జనరేషన్‌పై ప్రభావం పడనున్నది. దీని వల్ల కరువు పెరిగే అవకాశం ఉన్నది. తాగునీటి నిల్వలపై వత్తిడి పెరగనున్నది. మార్చి 1వ తేదీ నుంచి మే 27 వరకు దేశవ్యాప్తంగా 121.7 మిల్లిమీటర్ల వర్షం పడింది.

# మూడు నెలల్లో తీర్పు ఇవ్వాల్సిందే..

### -రిజర్వ్ తీర్పులపై హైకోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశం


**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**
కేసుల విచారణ అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన తర్వాత మూడు నెలల్లోగా తుది తీర్పు వెల్లడించాలని హైకోర్టులకు సుప్రీంకోర్టు సూచించింది. తీర్పు ఆలస్యం కావడం వల్ల పిటిషన్‌దారులకు తీవ్ర నష్టం జరుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని అన్ని హైకోర్టులు విచారణ అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన తర్వాత మూడు నెలల్లోగా తీర్పు వెల్లడించాలని ఆదేశించింది. రిజర్వ్ చేసిన తేదీ నుంచి తుది తీర్పు కోసం గరిష్ఠంగా మూడు నెలలు మాత్రమే సమయం తీసుకోవాలని సూచించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి



జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ జోయ్‌మాల్యా ఆధ్వర్యంలోని బెంచ్ తాజా ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. హైకోర్టులు బెయిల్ దరఖాస్తుకు సంబంధించిన కేసుల్లో విచారణ అనంతరం తీర్పును అదే రోజు వెల్లడించాలి. ఒకవేళ తీర్పు రిజర్వ్ చేస్తే మరుసటి రోజే తీర్పు ఇవ్వాలి. అలాగే, బెయిల్‌పై తీర్పు వెలువడిన వెంటనే ఈ ఆదేశాల్ని జైలు అధికారులకు త్వరగా అందేలా చూడాలి. బెయిల్, రిలీజ్ ఆదేశాలు పొందిన వారు వీలైతే అదేరోజు విడుదలయ్యేలా చూడాలి. ఒకవేళ ఆలస్యమైతే కనీసం మరుసటి రోజైనా విడులయ్యేలా చూడాలి. కింది కోర్టులు కూడా ఈ ఆదేశాల్ని పాటించాలి. అదే రోజు తీర్పు వెల్లడించి, సమాచారాన్ని జైలు అధికారులకు తెలియజేయాలి. అండర్‌ట్రయల్ ఖైదీలు అదే రోజు అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి విడుదలవ్వాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన కేసుల్లో మూడు నెలలకు ముందే తీర్పు వెల్లడించాలి. హైకోర్టుల్లో తీర్పు కోసం, న్యాయం కోసం వేలాది మంది పిటిషనర్లు ఎదురుచూస్తుంటారు. వారికి త్వరగా న్యాయం అందించడం కనీస కర్తవ్యం అని సుప్రీంకోర్టు

# ఒక్క రోజు వడగాల్పులతో దేశంలో 3,400 అదనపు మరణాలు

**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**
అధిక ఉష్ణోగ్రతలతో ప్రపంచవ్యాప్తంగా మరణాలు పెరుగుతున్నాయని, భారతదేశంలో ఒక్క రోజు వడగాల్పుల కారణంగా దేశవ్యాప్తంగా 3,400 అదనపు మరణాలు నమోదవుతుండగా, వరుసగా ఐదురోజుల పాటు తీవ్రమైన ఉష్ణోగ్రతలు కొనసాగితే సుమారు 30,000 మరణాలు రికార్డు కావచ్చని ఒక అధ్యయనం వెల్లడించింది. అమెరికాలోని కాలిఫోర్నియా బర్కిలీ యూనివర్శిటీకి చెందిన ఇండియా ఎనర్జీ అండ్ క్లైమేట్ సెంటర్ పరిశోధకులు పీయూష్ నారంగ్, అశోక్ గాడ్గిల్ నేతృత్వంలో జరిగిన ఈ పరిశోధన వివరాలు 'ఫ్రాంటైర్స్ ఇన్ ఎన్విరాన్ మెంట్ హెల్త్' పత్రికలో ప్రచురితమయ్యాయి. భారతదేశంలోని 10 రాష్ట్రాల పరిధిలోని జిల్లాల వారీ మరణాల రేట్లను, 2024 నాటి జనాభా అంచనాలతో సమన్వయం చేసి ఈ అదనపు మరణాలను పరిశోధకులు అంచనా వేశారు. గత కొన్ని రోజులుగా ఉత్తర, మధ్య, తూర్పు భారతదేశంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను మించిపోతుండటంతో వడగాలుల తీవ్రత హెచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా



విశ్లేషించగా, వరుసగా ఐదు రోజుల వడగాలుల సమయంలో ఒక్క ఉత్తరప్రదేశ్ లోనే సుమారు 8,100 అదనపు మరణాలు రికార్డయ్యాయని, అలాగే అహ్మదాబాద్, జైపూర్, సూరత్ వంటి నగరాల్లో ఒక్కోసారి 250కి పైగా అదనపు మరణాలు సంభవించాయని తేలింది. ముఖ్యంగా దేశంలోనే అత్యధిక మరణాల భారం మోస్తున్న ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో మరణాల తీవ్రతకు, అక్కడి ఆర్థిక సామర్థ్యానికి మధ్య 2.3 రెట్ల అసమానత ఉన్నట్లు గుర్తించారు. ఈ ఐదు రాష్ట్రాలు కలిసి దేశంలోని మొత్తం వడగాల్పుల అదనపు మరణాలలో 66 శాతం వాటాను కలిగి ఉండగా, భారతదేశ జీడీపీలో వీటి వాటా కేవలం 29 శాతమే కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఫలితాలు భారతదేశం తన వడగాల్పుల నిరోధక వ్యవస్థలను రూపొందించుకోవడంలోనూ, నిధుల కేటాయింపుల్లోనూ తక్షణ మార్పులు చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోందని పరిశోధకులు స్పష్టం చేశారు. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ, వాతావరణ మార్పులపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక కింద కేటాయించే కేంద్ర నిధులను కేవలం జనాభా లేదా పరిపాలనా సామర్థ్యానికి అనుపాతంలో కాకుండా, ఆర్థికంగా వెనుకబడి ఉండి వడగాల్పుల భారం ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు సాయం అందించేలా వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టాలని సిఫార్సు చేశారు. దక్షిణాసియా, ముఖ్యంగా భారతదేశం ఉష్ణోగ్రత సంబంధిత మరణాలకు ఎక్కువగా గురయ్యే ప్రమాదం ఉందన్న అంతర్జాతీయ మోడలింగ్ అంచనాలకు ఈ అధ్యయనం బలమైన నిదర్శనంగా నిలుస్తోంది.

# ఐపీఎల్ ఫైనల్లోకి గుజరాత్

మొదటి తరువాయి

రాజస్థాన్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని గుజరాత్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు 167 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను రాజస్థాన్ నుంచి లాగేసుకున్నారు. ముఖ్యంగా గిల్, రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోశాడు. కేవలం 53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులు చేశాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత రాహుల్ తెవాటియా (17 నాటౌట్) తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ వీరోచిత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతనికి రవీంద్ర జడేజా (45 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. చివర్లో డొనోవన్ ఫెరీరా (11 బంతుల్లో 38) విధ్వంసం సృష్టించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ బౌలర్లలో జాసన్ హోల్డర్, కగిసో రబాడ రెండేసి వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ ఫైనల్‌కు అర్హత సాధించగా, రాజస్థాన్ రాయల్స్ ప్రస్థానం టోర్నీలో ముగిసింది. మే 31న (ఆదివారం) జరిగే టైటిల్ పోరులో గుజరాత్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో తలపడనుంది

# పదవి పోయినా పెత్తనం నాదే..

మొదటి తరువాయి

రాహుల్‌కు కోర్కెల జాబితా

శుక్రవారం ఢిల్లీ చేరుకున్న సిద్ధరామయ్య పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కలుసుకుని తన డిమాండ్ల జాబితాను సమర్పించినట్లు తెలిసింది. డీకే శివకుమార్ నేతృత్వంలోని కొత్త క్యాబినెట్‌లో తన కుమారుడు యతీంద్రకు కీలక శాఖలు కేటాయించాలని ఆయన కోరినట్లు సమాచారం. సిద్ధరామయ్య క్యాబినెట్‌లో పీడబ్ల్యూడీ మంత్రిగా పనిచేస్తున్న సతీష్ జార్కిహోళికి కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిని అధిష్ఠానం ఆఫర్ చేసినట్లు వర్గాలు తెలిపాయి. అయితే తన రాజకీయ గురువు సిద్ధరామయ్యతో చర్చించిన తర్వాత తన నిర్ణయం తెలియచేస్తానని ఆయన చెప్పినట్లు సమాచారం. కాగా, సిద్ధరామయ్య డిమాండ్లలో ఎన్నిటిని అధిష్ఠానం ఆమోదిస్తుందన్న విషయం ఆసక్తికరంగా మారింది.

జూన్ 3న డీకే ప్రమాణం

కర్ణాటక ముఖ్యమంత్రిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డీకే శివకుమార్ జూన్ 3న ప్రమాణం చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. సీఎం సిద్ధరామయ్య ఈ నెల 28న (గురువారం) తన పదవికి రాజీనామా చేయగా శుక్రవారం గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ దాన్ని ఆమోదించడంతో డీకే ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

# కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు

మొదటి తరువాయి

అయితే, ఈ ప్రకటనను అమెరికా ఖండించింది. టెహ్రాన్ చెప్తున్నట్టుగా అలాంటిదేమీ లేదని కొట్టిపారేసింది. శుక్రవారం తెల్లవారుజామున బుషెహర్ ప్రావిన్స్‌లోని జామ్ ప్రాంతంలో శత్రు దేశానికి చెందిన ఓ యుద్ధ విమానాన్ని అడ్డగించినట్టు టెహ్రాన్ మీడియా తెలిపింది. ఇరాన్ వైమానిక దళాలు ఆ ఫైటర్‌జెట్‌ను కూల్చివేశాయని స్థానిక గవర్నర్‌ను ఉటంకిస్తూ వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా.. లేదా అనే పూర్తి వివరాలను మాత్రం అది వెల్లడించలేదు. ప్రస్తుతం బుషెహర్ ప్రాంతంలో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చాయని తెలిపింది. మరోవైపు, దాడుల్లో యుద్ధ విమానం కూలిపోతున్న ఓ ఫొటోను ఇరాన్ ఆర్మీ ఎక్స్ ఖాతాలో పంచుకుంది. అయితే, ఈ వాదనలను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. బుషెహర్ ప్రావిన్స్ సమీపంలో అమెరికా విమానాన్ని కూల్చేశామంటూ ఇరాన్ మీడియా అసత్య ప్రచారం చేస్తోందని వెల్లడించింది.

# రైతు డిస్కం ప్రభుత్వ కుట్ర

మొదటి తరువాయి

శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు డిస్కం ఏర్పాటుపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ శుక్రవారం ఎర్రగడ్డలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ లో కవిత పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రైతులకు మంచి చేసే ఆలోచనలో ఉంటే ఆరు నెలలుగా ఈ విషయాన్ని ఎందుకు దాచి ఉంచిందో చెప్పాలన్నారు. ఈ అంశంపై 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానూ వయబుల్ కాని ఈ ప్రపోజల్ ను తిరస్కరించాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. ఇంతటి కీలకమైన అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అసెంబ్లీలో చర్చ పెట్టాలన్నారు. అసలే డిస్కం ల పరిస్థితి బాగాలేని సమయంలో రూ. 25 వేల కోట్ల నష్టంతో ఉన్న డిస్కం ను కంపెనీ పేరుతో ఎలా రిజిస్టర్ చేస్తారని ఆమె నిలదీశారు. డిస్కం ల బకాయిలు రూ. 69 వేల కోట్లు ఉంటే అందులో 54 వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు చెల్లిస్తే మన డిస్కం లు మంచి రేటింగ్ లోకి వస్తాయని చెప్పారు. పైగా కొత్త డిస్కం కు యూనిట్ 6 రూపాయలు ఖర్చయ్యే థర్మల్ విద్యుత్ ను కేటాయిస్తున్నారని చెప్పారు. ఉచిత విద్యుత్, లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్, రైతులకు ఇచ్చే విద్యుత్ కు డబ్బులు ఇవ్వాల్సి ఉన్నా కే రూ. 54 వేల కోట్ల పెండింగ్ పెట్టిన ప్రభుత్వం కొత్త డిస్కం కు ఎక్కడ నుంచి డబ్బులు ఇస్తుందని ప్రశ్నించారు డిస్కంల నష్టాలను సాకుగా చూపి ఒక డిస్కం ను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. అటు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టమని చెప్పి ఇప్పుడు మాత్రం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రభుత్వ వైఖరి కనిపిస్తుందన్నారు ఈఆర్సీ నుంచి ఎలాంటి అనుమతి రాకుండానే జూన్ 2 నుంచి కొత్త డిస్కం పని

## ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై దృష్టి పెట్టిన ఆర్బీఐ!

మొదటి తరువాయి

ఈజీగా పాలిమర్ నోట్లను పంపిణీ చేయవచ్చు అన్న ఆలోచనలో ఆర్బీఐ ఉంది.పాలిమర్ కరెన్సీ నోట్లకు చెందిన పైలట్ ప్రాజెక్టును ఆర్బీఐ త్వరలో ప్రకటించనున్నది. పేపర్ మనీ ప్రింటింగ్ కోసం అయ్యే ఖర్చు బాగా పెరిగిపోయిందని, 5101.4 కోట్ల నుంచి 6,372.8 కోట్లకు ఆ ఖర్చు చేరుకుందని ఇటీవల ఆర్బీఐ వార్షిక నివేదికలో పేర్కొన్నది. బ్యాంక్ నోట్ల ప్రింటింగ్ కోసం డిమాండ్ పెరగడం వల్ల ఖర్చు పెరిగినట్లు నివేదికలో తెలిపారు. ఇక పాడైన, పాతబడిపోయిన, చిరిగిన పేపర్ కరెన్సీ నోట్ల సంఖ్య కూడా పెరిగిపోయింది. 2025 వార్షిక సంవత్సరంలో సుమారు 23.8 బిలియన్ల చిరిగిన నోట్లను రద్దు చేశారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 12.3 శాతం అధికం. 2024 వార్షిక సంవత్సరంలో సుమారు 21.24 బిలియన్ల చిరిగిన కరెన్సీ నోట్లను రద్దు చేసినట్లు తెలిసింది. 500, 100 నోట్లు ఎక్కువగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. 1988లో తొలిసారి ఆస్ట్రేలియా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టింది. 1996 నాటికి ఆ దేశం పూర్తి స్థాయిలో పాలిమర్ నోట్లను వినియోగంలోకి తెచ్చింది. ఇక కెనడా 2011లో పాలిమర్ కరెన్సీ నోట్లను తెచ్చింది. అయితే పేపర్ కన్నా పాలిమర్ బెటర్ అని కెనడా అనేక విశ్లేషణలు చేసింది.

# ప్రతి గింజా కొంటాం

మొదటి తరువాయి




అందుబాటులో ఉన్నాయన్నారు. కానీ ప్రతిపక్ష?లు ధాన్యం సేకరణలో దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘురామ్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. స్వతంత్ర భారత దేశంలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణలో అత్యధిక ధాన్యాన్ని సేకరించిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే తన నివేదికల్లో పేర్కొందని తెలిపారు. పదేండ్ల కాలంలో సేకరించిన పోల్చితే ఎక్కువగా కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించిందన్నారు. కేంద్రం సర్కారు నిర్ణయించిన మద్దతు ధర నిబంధలు పాటిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని విమర్శించారు. అయినా రూ. 16,479 కోట్లు అదనంగా చెల్లించి కొనుగోలు చేశామని చెప్పారు. కాళేశ్వరం, సుందిళ్ల రిజర్వాయర్ ఉపయోగించకుండానే అత్యధిక పంట ఉత్పత్తి జరుగుతోందన్నారు. చివరి గింజా వరకు కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో 1.41 లక్ష?ల మెట్రిక్ టన్నులు వరి ఉత్పత్తి అవుతోందనీ, అందులో 75 లక్ష?ల మెట్రిక్ టన్నుల సేకరిస్తామన్నారు. కానీ 52 లక్ష?ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తీసుకుంటాం. మిగతాది తీసుకోలేమంటూ కేంద్రం మెలిక పెట్టిందని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని కొని కూడా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. తెలంగాణలో కూలీలు పని చేయడం లేదనీ, పూర్తిగా బీహర్ హమాలీలపై ఆధారపడి ఉందన్నారు. బీహార్‌లో వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడం, బెంగాల్ ఎన్నికల నేపథ్యంలో కూలీల కొరత ఏర్పడిందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు బీఆర్ఎస్ సర్కారు రూ. 15వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ. 49వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. గత ప్రభుత్వం 7వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ సర్కారు 8575 కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 2024-25లో రూ. 36,143 కోట్లు, 2025-26లో రూ.39,359 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఆ సొమ్మును 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు.

# సర్ తో అందరికీ సమస్యే

మొదటి తరువాయి

మైనారిటీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదముందని అప్రమత్తం చేశారు. సర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. బూత్ ఎన్ రోలర్ సాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్ షిప్ చేయించామనీ, ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్ గాంధీ తో సన్మానం చేయించామని ఆయన గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్ రోలర్స్ ను స ర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. డిజిటట్ మెంబర్ షిప్ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇన్ చార్జ్‌ని నియమించి నిరంతరం పర్యవేక్షించామని తెలిపారు. సర్ కోసం 119 నియోజకవర్గాలు, 17 లోక్ సభ నియోజకవర్గాలకు ఇన్ చార్జ్‌లను నియమించాలనీ, అసెంబ్లీ ఇన్ చార్జీలు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేనని దిశానిర్దేశం చేశారు. ఇన్ చార్జీలు సరిగ్గా పని చేస్తే ఒక్క ఓటు కూడా?తొలగించకుండా అడ్డుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. ఇన్ చార్జ్ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పనిచేయాలనీ, క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తాను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తాననీ, నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తానని తెలిపారు. తనతో పాటు ఎవరికి మినహాయింపు ఇవ్వొద్దనీ, పార్టీ కోసం అందరూ పని చేయాల్సిందనని తేల్చి చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లతో సహా ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. దాదాపుగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామనీ, పార్టీ తరుపున ప్రస్తుతం వేలాది మంది సర్పంచ్ లు, మున్సిపల్ చైర్మెన్లు, కౌన్సిలర్లు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా పార్టీ నాయకులంతా సమన్వయం తో జాగ్రత్త పడాలని కోరారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్లేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని తెలిపారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యత అప్పగించాలనీ, నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో సర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాలని సూచించారు. సర్ పైన మహిళా కాంగ్రెస్ తరుపున క్లస్టర్ల వారీ గా సమావేశాలు నిర్వహించాలన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత

మొదటి తరువాయి



పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూఆర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు... భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# యూపీఎస్సీని చూసి బుద్ధి తెచ్చుకోండి

మొదటి తరువాయి



యంత్రాంగాన్ని రూపొందించే వివరాలను తెలియచేస్తూ ఒక ప్రత్యేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని కేంద్ర విద్యా శాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది.

ప్రత్యేక సిబ్బందిని నియమించడం, విస్తృత శ్రేణి నిపుణులను కలిగి ఉండటం ద్వారా ఎన్‌టీఏలో సంస్థాగత నైపుణ్యాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో అఫిడవిట్‌లో వివరించాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాదేలతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. 2024, 2026 నీట్ పరీక్ష వివాదాల వంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి అవసరమైన భౌతిక, మేధోపరమైన సామర్థ్యాలను ఎన్‌టీఏ కలిగి ఉండేలా చూడటమే ప్రధాన ధ్యేయంగా ఉండాలని కోర్టు పేర్కొన్నది. ఆరు వారాల్లోగా అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ఎన్‌టీఏ, ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్ డాక్టర్ కే రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

యూపీఎస్సీని చూసి నేర్చుకోండి

పర్యవేక్షణ యంత్రాంగాలు, పర్యవేక్షక కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)తో పోలుస్తూ దేశంలోని అత్యున్నత సివిల్ సర్వీసెస్ పరీక్ష అయిన యూపీఎస్సీలో ఇలాంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదని కోర్టు వ్యాఖ్యానించింది. యూపీఎస్సీ వ్యవస్థల నుంచి గుణపాఠాలు నేర్చుకోవలసిన అవసరం ఉందని సూచించింది. ఇస్రో మాజీ చైర్మన్ రాధాకృష్ణన్ కమిటీ అఫిడవిట్‌ను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది.

# కార్యకర్తల కృషితోనే మహానాడు ఘన విజయం

మొదటి తరువాయి



ఈ మహానాడు ఘన విజయం టీడీపీ టీమ్ కృషి అని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయగలమో టీడీపీ కుటుంబం నిరూపించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో జరగాల్సిన మహానాడు 2026ను అందరి అమోదంతో హైబ్రిడ్ విధానంలో మార్చామని మంత్రి లోకేష్ గుర్తు చేశారు. తెలుగుదేశం రాజకీయ పాఠశాలలో గురువు చంద్రబాబు నాయుడు సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మనకు నేర్పారని చెప్పారు. ఆ నేర్పును ఇంటర్నేషనల్ క్రైసిస్‌లో కూడా ఎవరూ ఊహించని విధంగా హైబ్రిడ్ మహానాడు ఒక అవకాశం తీసుకుని విజయవంతం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో మాదిరి ఒకచోట జరిగే మహానాడుకు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చేవారని పేర్కొన్నారు. తెలుగుదేశం నా బాధ్యత అంటూ ఇప్పుడు ప్రతి పల్లె, ప్రతి ఇల్లా మహానాడు వేదిక అయి.. పసుపు జెండాలతో రెపరెపలాడించిందన్నారు. కార్యకర్తలే అధినేతలే.. నేతలే మార్గదర్శులై రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను తామే తీసుకుని మహానాడు 2026ను కనివిని ఎరుగని రీతిలో విజయవంతం చేశారని చెప్పారు. స్త్రీ శక్తి ధీమకు అసలైన అర్థం చెప్పేలా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానానికి అందరి అమోదం లభించడం.. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడం ఈ మహానాడు సాధించిన మరో గొప్ప విజయం అని మంత్రి లోకేష్ అభివర్ణించారు. కార్యకర్తలే అధినేత నినాదాన్ని పార్టీ జాతీయ అధినేత అమలు చేసిన ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండు రోజుల మహానాడుకు ఒక్క మై టీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు కావడం మరో రికార్డు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, ఐటీడీపీ, ఐటీడీపీ, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. మహానాడు 2026 విజయం మీ అందరికీ అంకితం చేస్తున్నానని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. ఇది మీ విజయం అని మంత్రి లోకేష్ వెల్లడించారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు.

# సంపాదకీయం

## కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు



కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్‌- బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ-షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ధి పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్ధాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 -52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

# స్నేహ సంఘాలు ఏర్పాటు






**- కిషోర్ బాలికల నాయకత్వ లక్షణాలపై సమీక్ష సమావేశం**

**గాంధారి, మే 29 (మహా ప్రభ)**

గాంధారి మండలం కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో స్నేహ సంఘాల ఏర్పాటు ద్వారా కిషోర్ బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన గణనీయంగా పెరుగుతున్నాయి. గ్రామ స్థాయిలో ఏర్పడుతున్న ఈ సంఘాలు బాలికలకు తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి, సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు అన్వేషించడానికి మంచి వేదికగా నిలుస్తున్నాయి.సమీక్ష సమావేశంలో బాలికలలో కనిపించిన ముఖ్యమైన నాయకత్వ లక్షణాలు సమూహాన్ని సమన్వయం చేసే సామర్థ్యం బాధ్యతాయుతంగా వ్యవహరించడం సమావేశాలను నిర్వహించే నైపుణ్యంనిర్ణయాలు తీసుకునే ధైర్యం సామాజిక సమస్యలపై అవగాహన పెరగడం విద్య, ఆరోగ్యం, పరిశుభ్రతపై చైతన్యం కల్పించడం ఇతర బాలికలను ప్రోత్సహించే గుణం స్నేహ సంఘాల ద్వారా బాల్య వివాహాల నిరోధం, పాఠశాల హాజరు పెంపు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలలో కూడా మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. బాలికలు భవిష్యత్తులోసమాజానికి ఆదర్శ నాయకులుగా ఎదగడానికి ఈ సంఘాలు బలమైన పునాది వేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కిషోర్ బాలికలకు వివిధ రకాల ఆటలు నిర్వహించడం జరిగినది. బాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి సహస్ర, రెండవ బహుమతి నిహారిక, ఈసందర్భంగా నిర్వాహకులు విజేతలను అభినందించి, బాలికల్లో ప్రతిభ, ఆత్మవిశ్వాసం మరియు నాయకత్వ లక్షణాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ప్రసన్నకుమార్, గ్రామ సంఘ అధ్యక్షురాలు కళావతి, సిసిలు గొర్రె రాములు, సౌజన్య, సిఐలు స్వప్న, లక్ష్మీదేవి,లావణ్య,వనిత, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# మనుషులకూ మూడో కన్ను..

**దృష్టి పరిణామ క్రమంలో కొత్త కోణం కనుగొన్న న్యూరో సైంటిస్టులు**




**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**

: న్యూజిలాండ్‌కు చెందిన 'ట్యుటారా' అనే వింతయిన బల్లిలాంటి జీవిని దగ్గరగా చూస్తే మీరు ఒక అద్భుతమైన విషయాన్ని గమనించవచ్చు. అదే.. పని చేసే మూడో కన్ను. ట్యుటారా తలకు ఇరువైపులా ఉండే ప్రధాన కండ్లలాగే ఈ మూడో కన్ను కూడా లెన్స్, రెటీనా, మెదడుకు అనుసంధానించబడిన నరాలను కలిగి ఉంటుంది. సరీసృపం వంటి వెన్నెముక ఉన్న జీవికి ఇంతటి అధునాతనమైన మూడో కన్ను ఉండడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కానీ నిజం ఏమిటంటే మానవులకూ అలాంటిది ఒకటి ఉంది. 'పీనియల్ గ్రంథి' అని పిలిచే ఈ కన్ను పుర్రె కింద మెదడు లోపల లోతుగా దాగి ఉంటుంది. నేరుగా సూర్యకాంతి తగలకుండా ఉన్నప్పటికీ కాంతి, చీకట్లకు మన శరీరం ఎలా స్పందించాలో నిర్దేశించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తున్నది.కరెంట్ బయాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన ఒక కొత్త పరికల్పన అసలు ఈ చిన్న గ్రంథి ఎక్కడి నుంచి వచ్చిందో వివరించడానికి ప్రయత్నిస్తున్నది. మూడో కన్ను మన అత్యంత పురాతన పూర్వీకుల నుంచి వచ్చిందని ఈ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. అలాగే దీనిని అర్థం చేసుకోవడం ద్వారా దృష్టి పరిణామ క్రమంలో ఉన్న అత్యంత లోతైన చిక్కుముడులలో ఒకదానికి ఎట్టకేలకు సమాధానం దొరకవచ్చు. యూనివర్సిటీ ఆఫ్ ససెక్స్‌కు చెందిన న్యూరోసైంటిస్ట్, ఈ కొత్త అధ్యయన సహ రచయిత ప్రొఫెసర్ థామస్ బాడెన్ ప్రకారం.. పూర్వం మనం నిస్సారమైన సముద్రాలలో సముద్రగర్భం వెంబడి పాకే ఒక చిన్న పురుగు వంటి జీవి కంటే పెద్దగా ఏమీ లేము. ఇది నావిగేషన్ కోసం రెండు పక్క కండ్లను, కాంతి స్థాయిలను ట్రాక్ చేయడానికి, స్థిరంగా ఉండడానికి తలపై ఒక సాధారణ మధ్య కన్నును కలిగి ఉండే అవకాశం ఉంది. తర్వాత ఏదో మార్పు జరిగింది. చివరికి వెన్నెముక జీవులుగా మారే మన పూర్వీకులు తమ తలలను ఇసుకలో పాతుకోవడం ప్రారంభించారు. అడుగున ఉన్న అవక్షేపాలలో పూడుకుపోయి, పక్కనే తేలియాడే కణాలను ఆహారంగా తీసుకుంటూ బతికే వీటికి ఇకపై నావిగేట్ చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. అప్పటివరకు పెద్దగా ఉపయోగపడని, నిర్వహించడానికి ఎక్కువ శక్తి ఖర్చయ్యే పక్క కండ్లు క్రమంగా అంతరించిపోయాయి. మిగిలిందల్లా మధ్యలో ఉన్న సెన్సార్లు, ఫొటోరిసెప్టర్ల సమూహం మాత్రమే. ఇది పగలు, రాత్రిని, హెచ్చుతగ్గులను గుర్తించడానికి ఇప్పటికీ ఉపయోగపడుతున్నది. ఈ ఇసుకలో పూడుకుపోయే దశే వెన్నెముక జీవులు మిగతావాటికంటే భిన్నంగా ఉండడానికి కారణమని పరిశోధకులు సూచిస్తున్నారు. మిగతా అన్ని జంతువంశాలు తమ పక్క కండ్లను అలాగే ఉంచుకోగా, మనం మన కండ్లను కోల్పోయాము. ఒకరోజు వాటిని మళ్లీ కొత్తగా సృష్టించుకోవాల్సి వచ్చింది. అయితే అసలైన కన్ను పూర్తిగా మాయం కాలేదు. ఇది పీనియల్ గ్రంథిగా ఉండిపోయింది. ఇది సింహాల నుంచి బల్లులు, మీ వరకు దాదాపు అన్ని వెన్నెముక జీవులలో ఇప్పటికీ ఉన్నది. ట్యుటారాలు, కొన్ని ఇతర సరీసృపాలలో ఆ కణాలు దాదాపు పూర్తిగా రూపుదిద్దుకొన్న కన్నులాగే మిగిలిపోయాయి. చేపలలో ఇది కాంతిని నేరుగా గుర్తించే ఒక సరళమైన అవయవంగా ఉంది. క్షీరదాలలో ఇది ఆ సామర్థ్యాన్ని కోల్పోయింది. దానికి బదులుగా కండ్ల నుంచి వచ్చే సిగ్నల్స్ ద్వారా కాంతి సంకేతాలను అందుకుంటుంది.

# ఆయిల్ ప్యాకెట్ల సైజులో మార్పు?

**- కేంద్రంతో మార్కెట్ ప్రతినిధుల చర్చలు**



**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**

కేంద్ర ప్రభుత్వం వంటనూనె ప్యాకెట్ల సైజులో కీలక మార్పులు చేసేందుకు రెడీ అవుతున్నట్టు తెలుస్తున్నది. 2023 జనవరి 1 నుంచి ఆయిల్ ప్యాకెట్ల సైజులో సడలింపులు ఇవ్వగా అనేక రకాల సైజుల్లో ప్యాకెట్లు దొరుకుతున్నాయి. ఈ ప్యాకెట్లతో ఇబ్బంది అవుతుందని, పూర్వ సైజుల్లోనే అమ్మాలని వినియోగదారుల శాఖతో ఆయిల్ మార్కెట్ ప్రతినిధులు మంగళవారం సమావేశం అయ్యారు. ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న 650gm, 700gm, 810gm, 850gm, 870gm ప్యాకెట్ల తయారీని ఆపేయాలని ఇండస్ట్రీ ప్రతినిధులు కోరారు. నిబంధనల ప్రకారం ఉన్న 200ml, 500ml, 1ltr, 2ltr, 3ltr, 4ltr, 5ltr, 15ltr/kg, 20ltr/kg లోనే అమ్మేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆయిల్ మార్కెట్ ప్రతినిధులు చెబుతున్న దాని ప్రకారం.. మార్కెట్‌లో ప్రస్తుతం చాలా రకాల సైజుల్లో ప్యాకెట్లు దొరుకుతున్నాయి. దీంతో వినియోగదారులు ఏ ప్యాకెట్ ధర తక్కువగా ఉందో అర్థం చేసుకోలేకపోతున్నాడు. అన్ని ప్యాకెట్లు ఒకే సైజులో కనిపించినా ఆయిల్ పరిమాణం, ధరలో మార్పు గుర్తించలేకపోతున్నాడని ప్రతినిధులు చెబుతున్నారు. ఈ మేరకు సోయాబిన్ ప్రాసెసర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ అంశంపై ఈ నెల మొదట్లోనే కేంద్రానికి లేఖ రాసింది. సోపా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎన్ పతాక్ మాట్లాడుతూ మిల్లీలీటర్లు, గ్రాముల్లో తేడాను, ధరలను వినియోగదారుడు గుర్తించలేడని ఆయన తెలిపారు.

# వరకట్నం కోసం వేధించే వారికి గట్టి సందేశం వెళ్లాల్సిందే

**-వరుడి కుటుంబానికి విధించిన శిక్షను సమర్థించిన సుప్రీంకోర్టు**




**న్యూఢిల్లీ, మే 29 ( మహాప్రభ)**

దేశంలో పలుచోట్ల కొనసాగుతున్న వరకట్న వేధింపులపై తీవ్రంగా విరుచుకుపడిన సుప్రీంకోర్టు, 2010లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఒక వరకట్న మరణం కేసులో బాధితురాలి భర్త కుటుంబ సభ్యులకు శిక్ష నుంచి ఉపశమనం కల్పించడానికి తిరస్కరించింది. పెండ్లయిన తర్వాత అత్తింటికి వచ్చిన కోడళ్లను అవమానించిన కుటుంబాలకు గట్టి సందేశం వెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొంది. 'ఎందుకు అబ్బాయిలు.. అమ్మాయిలను పెండ్లి చేసుకుని వారిని, వారి కుటుంబాలను అవమానిస్తారు? వధువును, వారి కుటుంబ సభ్యుల అవమానించడం ఇకపై కొనసాగించ లేరనే గట్టి సందేశం వారికి ఈ శిక్ష ద్వారా వెళ్లాల్సిందే' అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.వరుడు కుటుంబానికి శిక్ష నుంచి ఉపశమనం కల్పించడానికి ఆమె తిరస్కరించారు. జస్టిస్ భుయాన్ కూడా ఉన్న ఈ ధర్మాసనంలో కింది కోర్టు, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు విధించిన శిక్షల్లో జోక్యం చేసుకోవడానికి తిరస్కరించింది. పిటిషనర్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ శిక్షను కొనసాగించాలని స్పష్టం చేసింది. కాగా, మధ్యప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ట్విషా అనే మహిళ ఆత్మహత్య కేసుపై విచారణ జరుగుతుండగా, అలాంటి తరహా కేసులోనే నిందితుల శిక్షను నిర్ధారిస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం గమనార్హం.

# డ్వాక్రా గ్రూపులకు ప్రభుత్వం ఆర్థికంగా అండ

**-కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్డిఓ శ్రీనివాస రావు ఏపిఎం సత్యనారాయణ**

**-ఎస్ఈఆర్పితో మహిళలకు ఉపాధి కల్పన**



**మనోహరాబాద్ ,మే,29,(మహా ప్రభ)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం రోజున ఘనంగా మహిళ వారోత్సవాలు జరిగాయి ఈ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం మహిళలకు రుణ సదుపాయంతో ఉపాధి అవకాశాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున బ్యాంకుల సహకారంతో ఆర్థికంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ముఖ్య ఉద్దేశంతో వారోత్సవాల భాగంగా మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎల్లవేళలా సహాయ సహకార అందిస్తూ ఉంటుంది ఎస్ఈ ఆర్పి డైరెక్టర్ లైవ్ స్టాక్ డైరెక్టర్ రాజేశ్వర్ పాల్గొన్నారు ఈ యొక్క కార్యక్రమంలో కోడి పిల్లల పంపిణీ చేయడం జరిగింది. 35 యూనిట్స్ 700 కోడి పిల్లలు గ్రౌండింగ్ చేయడము జరిగింది. 39 గ్రూపుల గాను మూడు కోట్ల 38 లక్షల రూపాయలు బ్యాంకు మేనేజర్లను సాంక్షన్ చేయడం జరిగింది స్వయం ఉపాధి గ్రామీణ పథకం ద్వారా మహిళలకు ప్రభుత్వం చేయూతనిస్తుంది ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు టీజీపీ బ్యాంక్ మేనేజరు మనోహరాబాద్ అనుపమ మేడం టీజీబీ కళాకారులు బ్రాంచ్ మేనేజర్ ప్రమీల మరియు డిసిసిబి ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ అదేవిధంగా సిబ్బంది సీసీలు కిషన్ , మమత శోభ మరియు ఏపీ ఎం సత్యనారాయణ పాల్గొనడం జరిగింది

# అంగన్వాడీలో మహిళా వారోత్సవాలు

**-సూపర్వైజర్, డి, చిట్టెమ్మ**







**దేవరకొండ మే 29 ( మహాప్రభ)**
దేవరకొండ మండల పరిధిలోని పూతల్ రామ్ తండా అంగన్వాడి కేంద్రం నందు మహిళా వారోత్సవాల లో భాగంగా సంబంధించిన సూపర్వైజర్ డి చిట్టెమ్మ ..మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రంలో నమోదు చేయాలని, అంగన్వాడి కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య, అనుబంధ ఆహారం, ఉంటుందని తెలియపరిచారు, కిశోర బాలికలకు మరియు తల్లిదండ్రులకు ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల కలిగి అనార్థాలు 18 సంవత్సరాలు నిండే వరకు ఆడపిల్లలకు, 21 సంవత్సరము నిండే వరకు మగ పిల్లలకు వివాహాలు చేయరాదని.. మరియు పిల్లల హక్కులపై అవగాహన కల్పించబడింది.పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక చట్టం -2013 గురించి వివరించడం జరిగినది.. గ్రామంలో ఎక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే, 1098,100,112,181, హెల్ప్ లైన్ ద్వారా సమాచారం ఇవ్వాలని తెలియపరిచారు…ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రూప్లి, గ్రామంలోని కిషోర్ బాలికలు, తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు,

# పిల్లుట్ల గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి రూ.30 వేల విరాళం



**శివంపేట, మే 29(మహాప్రభ):**
పిల్లుట్ల గ్రామంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ అభివృద్ధి నిమిత్తం లింగోజీగూడ మాజీ సర్పంచ్,యతిన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రముఖ సామాజిక సేవకులు మేఘావత్ రవి రూ.30,000/- నగదు విరాళాన్ని అందజేశారు. సమాజ అభివృద్ధి, విద్యా ప్రోత్సాహం మరియు సామాజిక సేవా కార్యక్రమాలలో ఎల్లప్పుడూ ముందుండే మేఘావత్ రవి గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను అందించడం అభినందనీయమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు చేరవేయడంలో విగ్రహాల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. అంబేద్కర్ విగ్రహ అభివృద్ధికి విరాళం అందించిన మేఘావత్ రవి కి గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బాలేష్, బుచ్చి బాలేష్, దాసరి కృష్ణ, లచ్చయ్య, రాజు, బాలు మరియు గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులు పట్టుదల క్రమశిక్షణతో చదవాలి ఉన్నత స్థాయికి ఎదగాలి

**డి.ఎస్.పి శ్రీనివాసరావు**

**దేవరకొండ మే 29 ( మహాప్రభ)**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదవ, ఇంటర్మీడియట్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన **విద్యార్థులకు ఘన సన్మానం:-**

దేవరకొండ నియోజకవర్గం లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామాజికవేత్త జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన పదవ, ఇంటర్మీడియట్ తరగతులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ డి ఎస్పి శ్రీనివాస్ రావు విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించిన వారిని బీసీ సంఘం వారు సన్మానం చేయడం చాలా సంతోషదాయకమని ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో ఎన్నో చేయాలని ఆకాంక్షించారు.విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాన్ని పెట్టుకొని చదివి ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో పేరు ,గౌరవం సంపాదించుకోవాలని






అన్నారు. దీంతోపాటు లక్ష్యం దిశగా ప్రయాణిస్తూ చాలామంది సమాజానికి సేవ చేస్తూ జీవితాన్ని అంకితం చేసుకోవాలని అన్నారు మరియు ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాతృనాయక్,కొండ్ర శ్రీశైలం యాదవ్, ఏకుల రాజారావు, రెడ్డి కోటేశ్వరరావు,ఎండి రంజాన్ బెగ్, పున్న వెంకటేష్ నేత, నట్టువ సుధాకర్, గరిడి విజయభాస్కర్, పొన్నం బిక్షమయ్య, లౌడ్య భాష నాయక్ , ఏండి అబ్దుల్ కలాం,మెరుగు శ్రీను, వరికుప్పల శ్రీను , కుంభం బాలచందర్,మెరుగు పెద్దయ్య యాదవ్ ,పల్చా శ్రీనివాస్ గౌడ్ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపల్స్ టీచర్స్ బీసీ సంఘాల, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల పట్టువస్త్రాలంకరణ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ డివిజన్ మే 29 ( మహాప్రభ )**
చింతపల్లి మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన నక్కనమోని ప్రేమలత,పరమేష్ గారి చిన్నారులు నవ్యశ్రీ, విఘ్నేష్ ల నూతన పట్టు వస్త్రాలంకలణ కార్యక్రమం మదునాపురం గేట్ సమీపంలో గల మోగుతాల యాదయ్య గార్డెన్ లో జరుగగా అట్టి కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భిల్యా నాయక్, కంకణాల వెంకట్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు ప్రవీణ వెంకట్ రెడ్డినాదిరి రమేష్,కేతావత్ శ్రీను నాయక్,మర్ల వెంకటయ్య,దెంది వెంకట్ రెడ్డి,ఆరకంటి మురళి , నర్సింహ,శశిదర్ రెడ్డి, మహేష్ , నిరంజన్ గౌడ్,మోగుతాల శంకర్, జైపాల్



నాయక్, కిషన్ తదితరులు పాల్గొన్నారు
చింతపల్లి మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన నక్కనమోని ప్రేమలత,పరమేష్ చిన్నారులు నవ్యశ్రీ, విఘ్నేష్ ల నూతన పట్టు వస్త్రాలంకలణ కార్యక్రమం మదునాపురం గేట్ సమీపంలో గల మోగుతాల యాదయ్య గార్డెన్ లో జరుగగా అట్టి కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భిల్యా నాయక్, కంకణాల వెంకట్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు ప్రవీణ వెంకట్ రెడ్డి ,నాదిరి రమేష్,కేతావత్ శ్రీను నాయక్,మర్ల వెంకటయ్య,దెంది వెంకట్ రెడ్డి,ఆరకంటి మురళి , నర్సింహ,శశిదర్ రెడ్డి, మహేష్ , నిరంజన్ గౌడ్,మోగుతాల శంకర్, జైపాల్ నాయక్, కిషన్ తదితరులు పాల్గొన్నారు

# బేటీ బచావో -- బేటీ పడావో

**-బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**



**దేవరకొండ మే 29( మహాప్రభ)**
నల్గొండ జిల్లా గుడిపల్లి లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం అంగన్‌వాడీ-2 కేంద్రంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రమీల, గ్రామ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులకు సూచించారు. బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కిశోర బాలికలకు ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే పౌష్టికాహారం అందించాలని, వారి శారీరక మరియు మానసిక అభివృద్ధికి కుటుంబ సభ్యులు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించి బాల్య వివాహాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. “బేటీ బచావో -- బేటీ పడావో” నినాదాలతో గ్రామంలో ప్రజలకు సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు మరియు యువత పాల్గొన్నారు.

# దీన్ దయాల్ ఉపాధ్యాయ మెదక్ జిల్లా ప్రశిక్షణ కార్యక్రమం.

**మెదక్ జిల్లా -29మే (మహాప్రభ ).**
వినాయక కన్వెన్షన్ హాల్ రామాయం పేట్ రోడ్డు మెదక్ నందు దీన్ దయాళ్ ఉపాధ్యాయ మెదక్ జిల్లా ప్రశిక్షణ కార్యక్రమం కలదు ఇట్టి కార్యక్రమానికి




ముఖ్యఅతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు మరియు పట్టభద్రుల ఎమ్మెల్సీ మరియు టీచర్స్ ఎమ్మెల్సీ అంజి రెడ్డి మల్కా కోమరయ్య విచ్చేస్తున్నారని బీజేపీ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ఆధ్వర్యంలో పల్లెల్లో పల్లెను జెండా పండుగ..

**-దేవరకొండ అసెంబ్లీ ఇన్చార్జి నేనావత్ శివనాయక్**



**దేవరకొండ మే 29 ( మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న పల్లె పల్లెన “జెండా పండుగ “ కార్యక్రమంలో భాగంగా శు క్రవారం నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం లో జెండా గద్దె నిర్మాణ పరిమిషన్ కోసం నల్లగొండ జిల్లా ఇంచార్జి విక్రాంత్ రెడ్డి, నల్లగొండ అబ్జార్వర్ దేవేందర్ రెడ్డి సమక్షంలో దేవరకొండ అసెంబ్లీ ఇంచార్జి నేనావత్ శివ నాయక్ మాట్లాడుతూ… స్థానిక మున్సిపల్ కమిషనర్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దేవరకొండ అసెంబ్లీ ఇంచార్జి నేనావత్ శివ నాయక్ మాట్లాడుతూ… రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు అక్షించిన స్వరాష్టం అన్ని విధాలా అభివృద్ధి దిశగా, పేదవాడి తలరాత మార్చే దిశగా, బడుగు బలహీన వర్గాలకు ఆసరాగా నిలిచే కార్యక్రమలు చేపట్టి రాష్టంలో బిఆర్ఎస్ ని అధికారంలోకి తీసుకచ్చే బాధ్యత ఎంతఐనా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ అసెంబ్లీ అబ్జార్వర్ పల్లె నిషా ముఖ్యనాయకులు పార్టీ సీనియర్ నాయకులు మల్లయ్య .పున్ని బాయ్ ,మహిళల నాయకురాల్లు పద్మ, భాగ్య, మరియు సురేష్ నాయక్, అనిల్ కుమార్, ప్రశాంత్, నరేష్, రవి, సంపత్ తదిర బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**- పీడీ డీఆర్డీఏ దామోదర్ రెడ్డి**



**గాంధారి, మే 28 (మహాప్రభ)**
గాంధారి మండలం బ్రాహ్మణపల్లి ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని పీడీ డీఆర్డీఏ దామోదర్ రెడ్డి, శు క్రవారం తనిఖీ చేశారు. అకాల వర్ష సూచన ఉన్నందున కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రంలో నిల్వ ఉన్న వరి బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఈ తనిఖీలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం ప్రసన్నకుమార్, సీసీ సౌజన్య, గ్రామ సంఘ ప్రతినిధులు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆవంచ గ్రామంలో ఐజీ గోదామును సందర్శించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్ గుప్తా



**శివంపేట, మే 29 (మహాప్రభ):**
నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోనీ ఆవంచ గ్రామంలో IG గోదాం నీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్ గుప్తా సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల వల్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పంటలకు జరిగిన నష్టం, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి ప్రయోజనాల కోసం పోరాడతానని శ్రీధర్ గుప్త హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, గ్రామస్తులు పాల్గొని తమ సమస్యలను వివరించారు.

## ధాన్యం కొనుగోలను పరిశీలించిన ఆవుల రాజిరెడ్డి



**శివ్వంపేట, మే 29(మహాప్రభ):**
నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి సేకరించిన ధాన్యానికి సరిపడ గోదాంలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి వెల్దుర్తి మండలం లోని మంగళపర్తి, కుకునూరు గ్రాూజూ గోదాములను అలాగే ప్రైవేటు గోదాములు, రైతు వేదికలను సందర్శించి ధాన్యం కొనుగోళ్లకు వాటిని కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు తడవకుండా వెంటనే గోదాములలో నిల్వ చేసి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. అందుబాటులో ఉన్న గోదాములను ధాన్యం కొనుగోళ్ల కోసం వినియోగించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో DCSO, DM,RI కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూమిలేని ఉపాది కూలీలకు 12000 ఇవ్వాలి.





**దేవరకొండ డివిజన్ మే 29 ( మహాప్రభ )**
కొండమల్లేపల్లిభూమిలేని ఉపాధి కూలీలకు 12 వేల రూపాయలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కొండ మల్లేపల్లి మండలం చినంనేనిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో కూలీల సమస్యలు తెలుసుకొని అనంతరం కంబాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు వ్యవసాయ కూలీలకు 12000 ఇస్తామని చెప్పి ఇప్పటికి అమలు చేయలేదని అర్హత ఉన్న కుటుంబాలకు 12000 చొప్పున చెల్లించాలని 50 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులకు నెలకు 5000 చొప్పున పింఛన్ ఇవ్వాలని డిమాండ్ ఉపాధి హామీ పని ప్రదేశంలో మౌలిక వసతులు ఆరగడ్డ పాలలు ఇతర మాలిక వసతులు కల్పించి కొత్త చట్టం ద్వారా రెండు పూటల ఫోటో విధానాన్ని రద్దు చేయాలని చేసిన పనులకు వారం వారం బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకొని పెరుగుతున్న ధరల అనుకూలంగా రోజు కూలి 800 రూపాయలు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీ నూతనంగా ఎన్నుకున్నారు.సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏ మల్లయ్య ఎస్ సీనయ్య కమిటీ సభ్యులు మమత బీసీనయ్య పి విజయ్ ఎన్నుకున్నారుఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సిహెచ్ సీనయ్య పాల్గొన్నారు

## రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో డబల్ బెడ్ రూమ్ వరకు వీది లైట్లు ఏర్పాటు



**రామాయంపేట మే 29 మహాప్రభ**
శుక్రవారం రోజున డబల్ బెడ్ రూమ్ కాలనీ కి సర్కార్ హాస్పిటల్ నుండి డబల్ బెడ్ రూమ్ కాలనీ వరకు వీధిలైట్లు రామంపేట మున్సిపల్ చైర్మన్ గాజవాడ లావణ్య నాగరాజు చేతుల మీదుగా వీధిలైట్లను ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గాజవాడ లావణ్య నాగరాజు దేవుని రంజిత్ కుక్కు ప్రవీణ్. కాంగ్రెస్ నాయకులు పోచమ్మల గణేష్ చింతల స్వామి చింతల యాదగిరి రాగి స్వామి, ఎర్రం సత్యం పరశురాములు డబల్ బెడ్ రూమ్ కాలనీ కమిటీ వాసులు కాంగ్రెస్ యూత్ సభ్యులు చిలుక విరాట్ దాకి నాగేంద్ర సాయి సుధీర్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ విద్యుత్ 1104 యూనియన్ మేడే వేడుకలు:

**దేవరకొండ మే 29 ( మహాప్రభ)**
తెలంగాణ విద్యుత్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో మేడే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) వేడుకలను శుక్రవారం జిల్లావ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. గుర్రంపోడు, డిండీ, చందంపేట, మరియు పి.ఎ. పల్లి మండల కేంద్రాలలో యూనియన్ నాయకులు విధిగా సంఘం జెండాలను ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల రక్షణే ధ్యేయంగా సాగిన ఈ కార్యక్రమాలలో 1104 విద్యుత్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తూము జైపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నిమ్మచెట్ల వెంకటయ్య, మరియు రాష్ట్ర నాయకులు వనపాల్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు



మాట్లాడుతూ... కార్మికులు తమ హక్కుల సాధన కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, 1104 యూనియన్ ఎల్లప్పుడూ కార్మిక శ్రేయస్సు కోసమే పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మధుసూదనచారి (కంపెనీ నాయకులు), సంజీవరెడ్డి (డివిజన్ అధ్యక్షులు), నాగలక్ష్మి, జే ఏ ఓ (జిల్లా సీనియర్ నాయకురాలు), రఘుమోహన్ రెడ్డి, కైలాష్ (సబ్ డివిజన్ లీడర్లు), శంకరనాయక్, పి. అంజయ్య (అఫ్ ఎం ), బిక్షం, ప్రతాప్ ( ఎల్ ఐ), అక్తర్ హుస్సేన్, ధన్ సింగ్ (సీనియర్ నాయకులు). ఈ మేడే వేడుకలలో ఆయా మండలాలకు చెందిన విద్యుత్ కార్మికులు, సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది మరియు సీనియర్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు

# కల్యాణలక్ష్మి,షాదిముబారక్ చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**మెదక్ జిల్లా -29మే(మహాప్రభ.**
పాపన్నపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను రూ.1కోటి 4లక్షల పన్నెండు వేల అర్వైనాలుగు రూపాయల చెక్కులు ,సిఎం ఆర్ ఎఫ్ పత్రాల పంపిణినీ శుక్రవారం నాడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.పాపన్నపేట తహసీల్దార్ సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై లబద్దిబారులకు104 చెక్కులను,పత్రాలను అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,తడిసిన దాన్యాన్ని సైతం కొనుగోలు చేసి బైల్డ్ మిల్లులకు తరలిస్తుందని,ఈవిషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, రైతులను తప్పుదోవ పట్టించేలా ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.అలాగె పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు లబద్ది అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.ప్రతిపక్షాల మాయ మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని,ఎన్నికల హామీలు అమలు పరచడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ప్రజాపాలనతో ప్రజల మన్ననలను పొందుతు ముందు సాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లింగంపేట నరేందర్ గౌడ్,సర్పంచ్ పావని గౌడ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేశం,సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్,ఏగొండ,శ్రీశైలం అప్ప, రజిత రాజశేఖర్,భాగ్యమ్మ, పద్మ,మాజీ కోప్షన్ సభ్యులు ఎండీ.గౌస్,నాయకులు భూమయ్య,సతీష్,మహేష్ కిష్టయ్య, ప్రవీణ్,శివయ్య, ప్రసాద్,బిక్షపతి, సత్యనారాయణ తో పాటు ఆయా గ్రామాల లబద్ధిదారులు కార్యకర్తలు పాల్గొన్నారు.ద

## ప్రజా ప్రతినిధులకు ఏర్పాట్లు కల్పించని పాపన్నపేట తహసీల్దార్

**మెదక్ జిల్లా -29మే(మహాప్రభ.**
ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమంలో సరిపోని గదిలో తహసీల్దార్ ఏర్పాటు చేయడంపై ప్రజా ప్రతినిధులు,లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు.శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ గదిలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు చేతుల మీదుగా చెక్కులు అందుకోవాలని వచ్చిన లబద్ధిదారులు ఒకరిపై ఒకరు పడే విదంగా ఉండడంతో ప్రజా ప్రతినిధులు ఆరు బయటే నిలుచొవలసి వచ్చింది.సరిపోని గదిలో వంద మందికిపైగా లబ్ధిదారులతో నిర్వహించిన చెక్కుల పంపిణి కార్యక్రమం అస్తవ్యస్థంగా మారింది.“అరవైలో వంద” అన్నట్లుగా చిన్న సమావేశ మందిరంలో భారీ సంఖ్యలో లబ్ధిదారులను



కూర్చోబెట్టడంతో ప్రజా ప్రతినిధులు లబ్దిదారులు, కార్యకర్తలు,తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎమ్మెల్యే పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా పదేపదే నిలిచిపోవడంతో చీకట్లోనే కార్యక్రమం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.కరెంట్ దోబూచులాటతో లబ్ధిదారులు,అధికారులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడ్డారు.సరిపడా ఏర్పాట్లు లేకపోవడంతో కొందరు ప్రజాప్రతినిధులు,మహిళలు సమావేశ మందిరం బయటే నిలబడాల్సి వచ్చింది.
లబ్ధిదారులకు చెక్కులు అందజేసే కార్యక్రమం కోసం ముందస్తు ప్రణాళిక లేకుండా అధిక సంఖ్యలో ప్రజలను పిలవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.కనీసం తాగునీరు,ఫ్యాన్లు,విద్యుత్ బ్యాకప్ వంటి సౌకర్యాలు కూడా లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

## జిల్లా కేంద్రంలో రూ. 5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణ పనులు తుది దశకు.

-నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదు.
-జిల్లా కేంద్రం లో గాంధీ నగర్ ఏ రియాలో తుది దశకు చేరుకున్న ఇందిరా మహిళా శక్తి భవన సముదాయ పనులను కలెక్టర్ పరిశీలన.
-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -29మే -(మహాప్రభ ).**
తెలంగాణలో మహిళా సాధికారతకు వేదికగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరితగతిన. పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని. ధ్యాన్చంద్ చౌరస్తా ఏరియా దగ్గర ఉన్న గాంధీనగర్ ఏరియాలో నిర్మాణం తుది దశకు చేరుకున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనుల సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈ.ఈ నరసింహులు తో కలిసి పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రూ. 5 కోట్లతో మంజూరై ఇందిరాస్ మహిళా శక్తి భవనం నిర్మాణం చేపట్టి తుది దశకు చేరుకుందని ఇంకా మిగిలి ఉన్న పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని, మహిళల శిక్షణకు, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఈ భవనాన్ని ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణ ప్లాన్లు, గదుల నిర్మాణం, మౌలిక వసతుల పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పరిశీలనలో పంచాయతీ రాజ్ ఈఈ నరసింహులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గర్బిణీ స్త్రీలకు గర్బవతులకు అవగాహన కార్యక్రమం

-ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక భాగంగా



**గాంధారి, మే 29 (మహా ప్రభ)**
గాంధారి మండలం నేరల్ తండా గ్రామపంచాయతీ లోని అంగన్వాడి కేంద్రం సెంటర్ 2 లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా శుక్రవారం గర్భిణీ స్త్రీలకు బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులకు శ్రీమంతాలు ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేయడం, అలాగే అమ్మ మాట అంగన్వాడి బాట ర్యాలీ నిర్వహించారని డి డబ్ల్యు ఓ ప్రమీల, మాట్లాడుతూ.. గర్భిణి స్త్రీలు మంచి పౌష్టికాహారం విటమిన్ లు ఉన్న ఆహారం తీసుకొవలని అంగన్వాడి కేంద్రలో ఆరోగ్యలక్ష్మి పథకంలో ఇచ్చే పౌష్టికాహారం పాలు గుడ్డు ఆకుకూరలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఇట్టి కార్యక్రమానికి ఎల్లారెడ్డి ప్రాజెక్టు ఏసిడిపిఓ ప్రసన్న కుమారి,ఎల్లారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని సూపర్వైజర్లు,గాంధారి మండల అంగన్వాడీ టీచర్లు గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు హాజరయ్యారు.

# బిజినెస్

## భారీగా పెరిగిన బంగారం ధరలు.. ఒకేరోజు ఊహించని స్థాయికి.. లేటెస్ట్ ధరలు ఇవే..

బంగారం ధరలపై షాకింగ్ న్యూస్ వచ్చేసింది. ధరలు భారీగా పెరిగాయి. గత మూడు రోజులుగా కొనసాగుతున్న తగ్గుదలకు బ్రేక్ పడినట్లయింది. గత కొద్ది రోజులుగా ధరలు పడిపోతుండటంతో కొనుగోలు చేసేవారు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడు ధరలు పెరగడంతో కొనుగోలు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. గంటల వ్యవధిలోనే ధరలు తారుమారు అవ్వగా.. ప్రస్తుతం దేశంలోని ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.భారత బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం రూ.1,57,640 వద్ద కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే శుక్రవారం ఒక్కరోజే రూ.1580 మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,44,500 వద్ద ట్రేడవుతోంది. నేడు ఒక్కరోజే రూ.1450 పెరిగిందని చెప్పవచ్చు. అయితే ప్రాంతాల వారీగా ధరల్లో వ్యత్యాసాలు అనేది ఉంటాయి. రాష్ట్రాలు విధించే ట్యాక్సులు, రవాణా ఖర్చుల వల్ల ధరలు రాష్ట్రాల వారీగా మారుతూ ఉంటాయి.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ రేటు



రూ.1,57,640గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,44,500 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,59,280 వద్ద కొనసాగుతోండగా.. నిన్న ఒక్కరోజే రూ.1100 పెరిగింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1.46 లక్షలుగా ఉండగా.. శుక్రవారం రూ.వెయ్యి మేర పెరిగింది. బెంగళూరులో 24 క్యారెట్ల రేటు రూ.1,57,640గా ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,500గా కొనసాగుతోంది.ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,790 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,44,650గా ఉంది. అటు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. ఢిల్లీలో కేజీ వెండి ధర రూ.2.80 లక్షలుగా ఉండగా.. నిన్న రూ.2.75 లక్షల వద్ద స్థిరపడింది. ఇక హైదరాబాద్‌లో కేజీ సిల్వర్ ధర రూ.2.90 లక్షలుగా ఉండగా.. నిన్న రూ.2.85 లక్షల వద్ద స్థిరపడింది. చెన్నైలో శుక్రవారం రూ.2.90 లక్షల వద్ద కొనసాగుతోంది.బంగారం ధరలు గత వారంలో స్వల్పంగానే పెరిగాయి. కానీ ఈ వారంలో మొన్నటివరకు తగ్గగా.. ఇప్పుడు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో రానున్న రోజుల్లో గోల్డ్ రేట్లు ఎలా ఉంటాయనే చర్చ కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడంతో ఇటీవల ధరలు దిగొచ్చాయి. డాలర్ బలం పుంచుకోవడం వల్ల ధరలు పడిపోయాయి.

## మరో రికార్డు దిశగా ఆంథ్రోపిక్!

### ట్రిలియన్ డాలర్లకు చేరువలో మార్కెట్ విలువ




**ఇంటర్నెట్ డెస్క్**
టెక్ రంగంలో భవిష్యత్తు ఇక ఏఐ సంస్థలదే అని ఇన్వెస్టర్లు బలంగా నమ్ముతున్నారు. ఫలితంగా ఏఐ స్టార్టప్‌ల మార్కెట్ విలువ అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ నిధుల సమీకరణ చేపట్టింది. మొత్తం 65 బిలియన్ డాలర్ల నిధులను సేకరించగలిగింది. ఈ క్రమంలో ఆంథ్రోపిక్ మార్కెట్ విలువ ఏకంగా 965 బిలియన్ డాలర్లుగా తేలింది. ఆల్టిమీటర్ క్యాపిటల్, డ్రాగోనీర్, గ్రీనోక్స్, సెక్వోయా క్యాపిటల్ వంటి సంస్థలు ఆంథ్రోపిక్‌లో పెట్టుబడులు పెట్టాయి. ఒక్కో సంస్థ రెండు బిలియన్ డాలర్ల మేర ఆంథ్రోపిక్‌లో ఇన్వెస్ట్ చేశాయి.టెక్ దిగ్గజాలు అనేకం ఇప్పటికే ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను దాటిపోయాయి. ఎన్విడియా, ఆల్ఫబెట్, యాపిల్ సంస్థల మార్కెట్ విలువ 4 ట్రిలియన్ డాలర్లకు పైనే ఉంది. ఇక మైక్రోసాఫ్ట్ (3.1 ట్రిలియన్ డాలర్లు), అమెజాన్ (2.8 ట్రిలియన్ డాలర్లు) కూడా దూసుకెళుతున్నాయి. ఏఐకి మారుపేరుగా మారిన చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐ కూడా ఐపీఓకు సిద్ధమవుతోంది. 800 బిలియన్ డాలర్ల నుంచి ట్రిలియన్ డాలర్ల మధ్య మార్కెట్ విలువను చేరుకునేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, ఆంథ్రోపిక్ ఇప్పటికే 900 బిలియన్ డాలర్ల మార్కును దాటేసింది. ఇదే ఒరవడి కొనసాగితే ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను చేరుకున్న తొలి ఏఐ స్టార్టప్‌గా ఆంథ్రోపిక్ అవతరించే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

## భారతీయ స్టాక్ మార్కెట్లు భారీగా పతనం..

**-1100 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్.. రూ.5 లక్షల కోట్లు నష్టం**

భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా పతనమయ్యాయి. ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన ట్రేడింగ్ చివరికి అమ్మకాల ఒత్తిడి కారణంగా భారీనష్టాల్లో ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 1,092.06 పాయింట్లు (1.44 శాతం) నష్టపోయి 74,775.74 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 76,220.02 పాయింట్ల గరిష్టాన్ని తాకినప్పటికీ చివరికి నష్టాల్లో ముగిసింది.ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 359.40 పాయింట్లు (1.50 శాతం) నష్టపోయి 23,547.75 వద్ద ముగిసింది. దేశంలో ఇన్వెస్టర్ల సంపద ఈ ఒక్కరోజే దాదాపు రూ.5 లక్షల కోట్లు నష్టపోయింది. ప్రస్తుతం మార్కెట్ విలువ రూ.466 లక్షల కోట్లుగా ఉంది. దేశంలో రుతుపవనాల రాక ఆలస్యం కానుందనే వార్తలు, అమెరికా--ఇరాన్ మధ్య శాంతి చర్చలు కొలిక్కి రాకపోవడం మార్కెట్





పతనానికి ప్రధాన కారణాలు. దేశంలో రుతపవనాలు ఆలస్యమైతే వర్షాలు సరిగ్గా కురవవు. దీనివల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం మార్కెట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభాలు చవిచూడగా, మిగతా షేర్లు భారీగా నష్టపోయాయి. వాటిలో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ఎక్కువగా నష్టాలు చవిచూశాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారక విలువ 95.05గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల ధర 91.40 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర 4530 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# స్పోర్ట్స్

## ముంబై ఇండియన్స్‌కు పాండ్యా గుడ్ బై.. హింట్ ఇచ్చేశాడా..!

ఒకప్పుడు ముంబై ఇండియన్స్ తోపు ఆటగాడైన హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా మాత్రం మెప్పించలేకపోయాడు. వరసగా మూడు సీజన్లలో నిరాశజనక ప్రదర్శనతో ముంబై అభిమానులు, యాజమాన్యం ఆశల్ని వమ్ము చేశాడు. అంతర్జాతీయ టీ20ల్లో భారత జట్టుకు వరసగా సిరీస్‌లు గెలిపించిన ఈ బరోడా స్టార్.. ఐపీఎల్‌లో మాత్రం ముంబైని ఛాంపియన్‌గా నిలపలేకపోయాడు. 19వ సీజన్‌లో ఫ్లాప్ షో కారణంగా.. మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న అతడు వచ్చే సీజన్‌లో కొత్త జట్టుకు ఆడడం ఖాయమనే వార్తలు వినిపిస్తున్నాయి.ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా.. ఆల్‌రౌండర్‌గా దారుణంగా విఫలమయ్యాడు. స్టార్ ఆటగాళ్లైన రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వైఫల్యం.. ప్రధాన పేసర్ బుమ్రా వికెట్లు తీయకపోవడం ముంబైని ముంచాయి. ఒకింత సమిష్టి వైఫల్యం ఓ కారణమైనా.. సారథి పాండ్యావైపే వేళ్లు చూపిస్తున్నారంతా. ఈ నేపథ్యంలోనే అతడిపై వేటు తథ్యమనే వార్తలు వినిపిస్తున్నాయి.అందుకు బలం చేకూర్చేలా లీగ్ దశ ఆఖర్లో సూర్యకుమార్ యాదవ్..




బుమ్రా టాస్‌కు వచ్చారు. ఆటగాడిగా, నాయకుడిగా తేలిపోయిన పాండ్యా మానసిక ఒత్తిడితోనూ బాధ పడుతున్నాడట. అందుకని.. అతడు ముంబైని వీడాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని సీజన్ మధ్యలోనే యాజమాన్యానికి చెప్పేశాడని తెలుస్తోంది. అయితే.. ముంబై ఫ్రాంజైజీ మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు.

**మళ్లీ పాత కథ..**
ఐపీఎల్ 17వ సీజన్‌తో ముంబై ఇండియన్స్ పగ్గాలు చేపట్టిన పాండ్యాకు రోహిత్ శర్మ అభిమానుల నుంచి విమర్శలు ఎదురయ్యాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో అతడి మాటకు విలువ లేకపోవడంతో మైదానంలో రాణించలేకపోయాడు పాండ్యా. కానీ, 18వ సీజన్‌లో జట్టును గొప్పగా నడిపించాడు. తొలి రెండు మ్యాచులు ఓడిన ముంబైని గెలుపు బాట పట్టించి ఏకంగా ప్లే ఆఫ్స్‌కు తీసుకెళ్లాడు పాండ్యా.కానీ, 19వ సీజన్‌లో మాత్రం మళ్లీ పాత కథే అన్నట్టు ముంబైకి ఏదీ కలిసి రాలేదు. ఓపెనర్ రికెల్టన్, డికాక్, తిలక్ వర్మ మినహా బ్యాటింగ్ యూనిట్ చెత్త ప్రదర్శనకు తోడు.. పవర్ ప్లేలోనే వికెట్లు తీసే బుమ్రా, బౌల్ట్ నిరాశపరిచారు. ధనాధన్ ఆటతో అలరించే పాండ్యా కేవలం 206 పరుగులే చేశాడు. ఫలితంగా14 మ్యాచుల్లో 4 విజయాలతో స్థానంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది ముంబై.

## ఆ సన్‌గ్లాస్‌లు వద్దు..

### ఐపీఎల్ క్రికెటర్లకు బీసీసీఐ కొత్త ఆంక్షలు



**ముంబై:**
ఐపీఎల్ క్రికెటర్లకు కొత్త ఆంక్షలు విధించింది బీసీసీఐ. ఈ సీజన్‌లో ఇంకా రెండు మ్యాచ్‌లో మిగిలి ఉన్నాయి. ఇవాళ రాజస్థాన్, గుజరాత్ మధ్య ఎలిమినేటర్ 2 మ్యాచ్ జరగనున్నది. ఇక ఇవాళ్టి విజేతతో ఆదివారం ఆర్సీబీ ఫైనల్ ఆడుతుంది. అయితే ఈ నేపథ్యంలో బీసీసీఐకి చెందిన అవినీతి నిరోధక శాఖ ఓ కీలక ఆదేశం ఇచ్చింది. ఆటగాళ్లు కానీ, మ్యాచ్ అఫీషియల్స్ కానీ స్మార్ట్ సన్‌గ్లాస్‌లు వాడకూడదని ఆదేశించింది.కొత్తగా వస్తున్న స్మార్ట్ సన్‌గ్లాస్‌ల్లో అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ ఫీచర్లు ఉన్నాయని, వాటితో లైవ్ స్ట్రీమింగ్, వీడియో కాలింగ్ చేసే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ పేర్కొన్నది. మొబైల్ డేటా లేదా వైఫై నెట్వర్క్‌తో స్మార్ట్ సన్‌గ్లాస్‌లను దుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ తన హెచ్చరికలో తెలిపింది.కొన్ని స్మార్ట్ సన్‌గ్లాస్ కంపెనీలు ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్‌తో మార్కెటింగ్ చేస్తున్నాయని, ఈ నేపథ్యంలో వాటి వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు బీసీసీఐ చెప్పింది. స్మార్ట్ సన్‌గ్లాస్‌లను ఆడియో-వీడియో రికార్డింగ్ డివైస్‌గా భావిస్తున్నామని బీసీసీఐ తెలిపింది.

## అర్జెంటీనా సారథిగా లియోనిల్ మెస్సి..

### 2026 ఫిఫా వరల్డ్‌కప్ జట్టు ప్రకటన

**న్యూయార్క్:**
సస్పెన్స్ వీడింది. ఫిఫా వరల్డ్‌కప్ ఫుట్‌బాల్ టోర్నీ కోసం అర్జెంటీనా జట్టును ప్రకటించింది. స్టార్ ప్లేయర్ లియోనిల్ మెస్సి ఆ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 26 మంది సభ్యులతో కూడిన బృందాన్ని జాతీయ కోచ్ లియోనిల్ స్కాలోని ప్రకటించారు. అయితే రాబోయే వరల్డ్‌కప్‌లో ఆడేది అనుమానంగా ఉన్నట్లు ఇటీవల మెస్సి ప్రకటించాడు. కానీ ఆ సస్పెన్స్‌ను బ్రేక్ చేస్తూ జాతీయ కోచ్ కీలక ప్రకటన చేశారు. దీంతో రికార్డు స్థాయిలో మెస్సి ఆరోసారి వరల్డ్‌కప్ ఆడనున్నాడు. 8 సార్లు బాలన్ డోర్ అవార్డు గెలిచిన మెస్సికే సారధ్య బాధ్యతలను అప్పగించారు. ఖతార్‌లో నాలుగేళ్ల క్రితం జరిగిన వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా టైటిల్‌ను గెలిచిన విషయం తెలిసిందే. అయితే అర్జెంటీనా జట్టులో రియల్ మాడ్రిడ్ ప్లేయర్ ఫ్రాంకో మస్తానటునో పేరు లేదు. జూన్ 11వ తేదీ నుంచి వరల్డ్‌కప్ ఫుట్‌బాల్ టోర్నీ జరగనున్నది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తున్నాయి. కన్సాస్ సిటీలో జరిగే తన తొలి మ్యాచ్‌లో అల్జీరియాతో అర్జెంటీనా ఢీకొననున్నది.
ఆటగాళ్ల వివరాలు..



గోల్‌కీపర్స్: ఎమిలియానో మార్టినేజ్, జిరోనిమా రుల్లి, జువాన్ ముసో
డిఫెండర్స్: గొంజాలో మాంటిల్, నాహుల్ మోలినా, లిసాండ్రో మార్టినేట్, నికోలస్ ఒటమెండి, లియోనార్డో బార్లేడి, క్రిస్టియానా రొమారియో, ఫకుండా మెదీనా, నికోలస్ తగ్లియాఫికో
మిడ్‌ఫీల్డర్లు: లియాండ్రో పరేడ్స్, రోడ్రిగో డీ పాల్, ఎక్స్‌కుయల్ పాలేసియస్, ఎంజో ఫెర్నాండేజ్, అలెక్సిస్ మాక్ అలిస్టర్, జియోవాని లో సెల్సో, వాలెంటినా బార్కో
అటాకర్స్: లియోనిల్ మెస్సి, నికోలస్ పాజ్, థియాగో అల్మడా, నికోలస్ గొంజాలెజ్, జులియన్ అల్వరేజ్, గులియానో సిమోని, లౌతారో మార్టినేజ్, జోస్ మాన్యువెల్ లోపేజ్



బాలయ్య హీరోయిన్ గ్లామర్ ట్రీట్.. ఫొటోలు వైరల్!

# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు




అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.

## ఆ సాంగ్ వల్ల.. నన్ను ఇష్టపడని వారు కూడా

# నాకు ఫోన్ చేసి మెచ్చుకున్నారు..



అందాల భామ శ్రుతీహాసన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది. ఒకప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోయిన ఈ చిన్నది ఇప్పుడు సినిమాల స్పీడ్ తగ్గించింది. రీసెంట్ డేస్ లో వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్ లో సక్సెస్ కోసం ఎంతగానో ఎదురుచూసిన శ్రుతిహాసన్ ఆతర్వాత వరుసగా విజయాలను అందుకుంది. తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్ గా రాణిస్తుంది శ్రుతిహాసన్. మొన్నామధ్య హిందీలోనూ ట్రై చేసింది.. కానీ అక్కడ లక్ కలిసి రాలేదు. దాంతో ఇప్పుడు తెలుగు. తమిళ్ సినిమాల పైనే ఎక్కువ దృష్టిపెడుతుందిప్రభాస్ హీరోగా నటించిన సలార్ సినిమాతో భారీ హిట్ అందుకుంది. ఆ సినిమాతో పాన్ ఇండియా స్టార్ గా మారిపోయింది శ్రుతి. అలాగే సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలోనూ నటించి మెప్పించింది. ఇప్పుడు సలార్ 2లో నటిస్తుంది. కాగాశ్రుతి కేవలం నటిగానే కాదు సింగర్ గాను తన ప్రతిభ చాటుకుంటుంది. ప్రైవేట్ ఆల్బమ్స్ చేస్తూనే ఛాన్స్ దొరికినప్పుడల్లా సినిమాల్లోనూ పాడుతుంది. మొన్నామధ్య నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలోనూ ఓ పాట పాడింది శ్రుతి. హీరోయిన్ గా, సింగర్ గా రాణిస్తున్న ఈ అమ్మడు స్పెషల్ సాంగ్స్ లోనూ అదరగొడుతుంది. ప్రస్తుతం మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమాలో స్పెషల్ సాంగ్ చేస్తుంది శ్రుతి.. ఇటీవలే ఈ సాంగ్ ను విడుదల చేశారు. డాన్స్ ఇరగదీసింది ఈ ముద్దుగుమ్మ.. కాగా మొన్నామధ్య కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ సినిమాలోనూ ఓ పాటను పాడింది ఈ అమ్మడు. ఈ సాంగ్ గురించి ఆమె మాట్లాడుతూ.. నా జీవితకాలంలో ఎన్నో పాటలు పాడాను.. ప్రేక్షకులను నా సాంగ్స్ ను ఎంజాయ్ చేశారు.. కానీ ఎప్పుడు ఇంత రెస్పాన్స్ రాలేదు. థగ్ లైఫ్ సినిమాలో నేను పాడిన పాటకు మంచి స్పందన వచ్చింది. నన్ను ఇష్టపడని వారు కూడా ఇప్పుడు నాకు మెసేజ్ లు చేశారు. నాన్న సినిమాలో పాట పాడటం నాకు జీవితంలో మర్చిపోలేని అనుభవం. నా లాఫ్ లో మెమరబుల్ సాంగ్ అంటూ చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు మరోసారి చక్కర్లు కొడుతున్నాయి.

# బాలీవుడ్ రీ-ఎంట్రీకి విజయ్ దేవరకొండ స్కెచ్..

## - మ్యాడాక్ బ్యానర్‌లో విక్రమ్ కుమార్‌తో క్రేజీ ప్రాజెక్ట్!



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యంత కీలకమైన, అత్యంత బిజీ ఫేజ్‌లోకి అడుగుపెట్టినట్లు కనిపిస్తోంది. వరుస ప్రాజెక్టులతో వివిధ చిత్ర పరిశ్రమల్లో తన మార్కెట్‌ను విస్తరించుకునేందుకు విజయ్ గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడు. లైగర్ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ రౌడీ స్టార్, ఇప్పుడు హిందీ చిత్రసీమలో మరో ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ ద్వారా గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.తాజాగా విజయ్ దేవరకొండ ముంబైలోని ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ 'మ్యాడాక్ ఫిల్మ్స్' కార్యాలయంలో కనిపించడం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మనం, 24 వంటి విభిన్న చిత్రాలతో పాటు దూత వెబ్ సిరీస్‌తో మెప్పించిన ప్రముఖ దర్శకుడు విక్రమ్ కుమార్‌తో విజయ్ దేవరకొండ ఒక భారీ ప్రాజెక్ట్‌ను ఓకే చేసే పనిలో ఉన్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ భేటీలో విక్రమ్ కుమార్ వినిపించిన ఒక భారీ స్థాయి కాన్సెప్ట్ విజయ్‌కి బాగా నచ్చిందని, కథలోని ఎమోషనల్ డెప్త్ మరియు కమర్షియల్ అంశాలు ఆయనను ఎంతగానో ఆకట్టుకున్నాయని సమాచారం. గత ఆరు నెలలుగా వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రచారం జరుగుతుండగా, ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కేందుకు అడుగులు పడుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన కథా పరమైన చర్చలు ఇప్పటికే ముగియగా, ప్రస్తుతం ఆర్థిక లావాదేవీలు మరియు నిర్మాణ ఫార్మాలిటీస్‌పై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇవి తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తెలుగుతో పాటు హిందీ మార్కెట్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, పాన్ ఇండియా స్థాయిలో రూపొందించనున్నారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్ దేవరకొండ, ప్రస్తుతం పూర్తి స్థాయిలో ప్రొఫెషనల్ లైఫ్‌పై దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఆయన చేతిలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్దన్', రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో 'రణబాలి' చిత్రాలతో పాటు 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యవ్ దర్శకత్వంలో ఒక ఎమోషనల్ డ్రామా ఉన్నాయి. ఈ క్రేజీ లైనప్‌కు ఇప్పుడు విక్రమ్ కుమార్ మరియు మ్యాడాక్ ఫిల్మ్స్ కాంబినేషన్‌లో రాబోయే పాన్ ఇండియా సినిమా తోడుకావడంతో అటు అభిమానుల్లోనూ, ఇటు ట్రేడ్ వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. వైవిధ్యమైన చిత్రాలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న విజయ్ దేవరకొండ కెరీర్‌కు రాబోయే కాలం అత్యంత కీలకంగా మారనుంది

# కన్నీటిలో దాచుకున్న ప్రేమ నువ్వనీ.



దర్శకుడు వెంకీ కుడుముల నిర్మాతగా మారి నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం ద్వారా మహేశ్ ఉప్పల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అనస్వరరాజన్ కథానాయిక. ప్రచార చిత్రాలు ఇప్పటికే సినిమాపై అంచనాలు పెంచాయి. తాజాగా ఈ సినిమా ఫస్ట్ సింగిల్‌ని అగ్ర హీరో నాని విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.కన్నుదాటి జారే నీటిలో.. దాచుకున్న ప్రేమే నువ్వనీ.. గొంతులోనే ఆగే మాటలో.. చెప్పుకోనీ బాధే నువ్వనీ..' అంటూ ఈ పాట ప్రోమో సాగింది. కల్యాణ్‌చక్రవర్తి రాసిన ఈ పాటను స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ స్వరపరచగా, మరో స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ ఆలపించడం విశేషం. ఈ పాటలో సంజన ఆలపించిన కర్ణాటిక్ నోట్స్, హర్షవర్ధన్ ర్యాప్ సెగ్మెంట్ ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. దూరం నుంచి హీరోయిన్‌ని ప్రేమించే హీరో ప్రేమభావాలను ఈ పాట ఆవిష్కరిస్తున్నది. ఈ పాటలో హీరో అనీష్ డాన్స్, విజువల్‌గా ఫ్రెష్ ఫీల్ ఇస్తున్నది. అనస్వరరాజన్ అందంగా, గంభీరంగా పాటకు ఆకర్షణగా నిలిచింది.

# సూపర్ స్టార్‌తో అనసూయ స్పెషల్ మూమెంట్..

## వైరల్ అవుతున్న ఫోటోలు!



టాలీవుడ్ బుల్లితెరపై యాంకర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న నటి అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం సినిమాల్లో కూడా తనదైన ముద్ర వేస్తోంది. 'జబర్దస్త్' షో ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన అనసూయ, ఆ తర్వాత వెండితెరపై వరుస అవకాశాలు అందుకుంటూ బిజీ ఆర్టిస్ట్‌గా మారిపోయింది. ముఖ్యంగా గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్లను ఎంచుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. 'రంగస్థలం' సినిమాలో రంగమ్మత్త పాత్రతో అనసూయ నటిగా కొత్త గుర్తింపు తెచ్చుకుంది. ఆ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. అనంతరం 'పుష్ప' సినిమాలో దాక్షాయణిగా కనిపించి పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించింది. ఇలా ఒక్కో చిత్రంలో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంది.ఇదిలా ఉంటే.. ఇటీవల అనసూయ తన కుటుంబంతో కలిసి సమ్మర్ వెకేషన్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ట్రిప్‌లో ఆమెకు ఊహించని ఓ స్పెషల్ మూమెంట్ దక్కింది. సౌత్ ఇండియన్ సినీ ఇండస్ట్రీలో లెజెండరీ స్టార్‌గా పేరు తెచ్చుకున్న సూపర్ స్టార్ రజినీకాంత్‌ను అనసూయ ప్రత్యక్షంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనతో కలిసి దిగిన ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది.అంతేకాకుండా "మై ఆల్ టైమ్ ఫేవరెట్" అంటూ రజినీకాంత్‌పై తన అభిమానాన్ని వ్యక్తపరిచింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అనసూయ ముఖంలో కనిపిస్తున్న ఆనందం, రజినీకాంత్‌తో ఆమెకు ఉన్న అభిమానం ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అయితే ఈ ఫోటోలపై సోషల్ మీడియాలో పలు ఆసక్తికర చర్చలు కూడా జరుగుతున్నాయి. కొందరు నెటిజన్లు రజినీకాంత్ నటిస్తున్న తదుపరి చిత్రంలో అనసూయకు కీలక పాత్ర దక్కిందని, అందుకే ఈ ఫోటోల ద్వారా హింట్ ఇచ్చిందని అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం ఇది పూర్తిగా అభిమానంతో దిగిన ఫోటో మాత్రమేనని, సెలవుల్లో అనుకోకుండా కలిసిన సందర్భమని చెబుతున్నారు.ఏదేమైనా, సూపర్ స్టార్ రజినీకాంత్‌తో అనసూయ దిగిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. మరోవైపు అనసూయ నటిగా వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతుండగా.. ఆమె తదుపరి ప్రాజెక్టులపై కూడా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com